మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు


NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం SATURDAY 6-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 97 Issue: 97

06 అక్టోబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:10 సూర్యాస్తమయం - సా. 5:57 తిథిః చతుర్దశి మ. 12:20 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర తె. 3:52ం వరకు తరువాత రేవతి యోగం వృద్ధి మ. 1:07 వరకు కరణం వనిజ మ. 12:20 వరకు విష్టి రా. 10:50 వరకు వర్జ్యం మ. 2:58 నుండి సా. 4:25 వరకు దుర్ముహూర్తం మ. 12:27 నుండి మ. 1:14 వరకు మ. 2:48 నుండి మ. 3:36 వరకు రాహుకాలం ఉ. 7:39 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:35 నుండి మ. 12:04 వరకు గుళికాకాలం మ. 1:32 నుండి మ. 3:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:34 నుండి తె. 5:22 వరకు అమృత ఘడియలు రా. 11:18 నుండి రా. 12:45 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:40 నుండి మ. 12:27 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

### బీహార్ ఎన్నికల నుంచే అమలు: సీఈసీ

న్యూఢిల్లీ/పాట్నా: బిహార్‌లో నవంబర్ 22 లోగా అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తొలిసారిగా ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరాలను పట్నాలో జరిగిన మీడియా తరువాయి 2 వ పేజీలో...



## రేషన్ డీలర్లూ పోటీకి అర్హులే

### స్థానిక ఎన్నికలపై ఈసీ గైడ్‌లైన్స్

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5 దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముదిని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నందున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవర్గంలో -2 వ పేజీలో...

# ప్రకృతి విలయ తాండవం

## నేపాల్‌లో భారీ వర్షాలకు 51 మంది బలి

### ఆకస్మిక వరదలు, విరిగిపడుతున్న కొండచరియలు

#### మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం

#### అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ

నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య 51కి చేరింది. తూర్పు నేపాల్ లో గత24 గంటల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో ఈ మరణాలు సంభవించాయి. అత్యధికంగా ఇల్లాం జిల్లాలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. సూర్యోదయ, మంగ్సేబంగ్, దేవ్ మై ప్రాంతాల్లోనూ మరణాలు నమోదయ్యాయి. పలువురు గాయపడగా అనేకమంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది తెలిపారు.



### డార్జిలింగ్‌లో 18 మంది మృతి

#### భయపెడుతున్న కుండపోత

#### కొండచరియలు విరిగిపడి ఆరుగురి మృతి

#### కుప్పకూలిన కీలక వంతెన

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కుండపోత వానల కారణంగా మిరిక్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతి బీభత్సానికి పర్యాటక ప్రాంతాలైన మిరిక్, కుర్సియాంగ్‌లను కలిపే కీలకమైన దూదియా ఐరన్ బ్రిడ్జి పూర్తిగా కుప్పకూలింది. దీంతో ఆ ప్రాంతాల మధ్య రవాణా సంబంధాలు తెగిపోయాయి.



### ఎవరెస్టుపై మంచుతుఫాను..


### 1000 మంది దిగ్బంధం

న్యూఢిల్లీ: ఎవరెస్టుపై మంచు తుఫాను బీభత్సం సృష్టించింది. భారీ హిమపాతం చోటు చేసుకోవడంతో టిబెట్ వైపుగా 16వేల అడుగులు ఎత్తులో 1000 మంది చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. వీరిలో కొందరు హైపోథెర్మియాతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. రెస్క్యూ చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొంది. స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.11,853 |
| వెండి (గ్రాము): | రూ.162 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,447 |

### విశ్వవాణి



కుక్క కళ్లలోకి తదేకంగా చూస్తే ఇద్దరిలోనూ లవ్ హార్మోన్ 'ఆక్సిటోసిన్' అనే రసాయనం ఉత్పత్తి అవుతుందని జపాన్‌లోని అజాబు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. కుక్కతో, మనిషి గాఢ సంబంధానికి ఇదొక నిదర్శనం అని పేర్కొన్నారు.

## తల్లి మందలించిందని.. కిరాతకంగా చంపేసిన బీటెక్ కుమారుడు

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తల్లిని కిరాతకంగా హత్య చేశాడు. తల్లి మందలించిందన్న ఆగ్రహంతో విచక్షణ కోల్పోయి కత్తితో గొంతు కోసి హతమార్చాడు.



ప్రొద్దుటూరు, అక్టోబర్ 5 (ఈవార్తలు): పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో ఈ ఉదయం జరిగిన ఈ దారుణం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కథనం ప్రకారం శ్రీరామ్ నగర్‌కు చెందిన యశ్వంత్ రెడ్డికి, అతడి తల్లి లక్ష్మీదేవికి మధ్య ఇంట్లో వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి లోనైన యశ్వంత్ వంటగదిలో ఉన్న కత్తితో తల్లిపై దాడి చేసి ఆమె గొంతు కోశాడు. అంతటితో ఆగకుండా, రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను ఇంటి బయటకు ఈడ్చుకొచ్చి పడేశాడు. ఈ ఘాతుకానికి పాల్పడే సమయంలో తన తండ్రిని మరో గదిలో బంధించడం గమనార్హం. మృతురాలు లక్ష్మీదేవి స్థానిక ఈశ్వర్‌రెడ్డి -2 వ పేజీలో...

## కూతురి భర్తను పెళ్లాడబోయి..

### అడ్డుపడిందని చంపాలని యత్నం

సభ్యసమాజం తలదించుకునే ఘటన తిరుపతి జిల్లాలో వెలుగుచూసింది. కన్న కూతురి కాపురంలోనే చిచ్చుపెట్టిన ఓ తల్లి, ఏకంగా ఆమె భర్తనే పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడింది. ఈ దారుణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కూతురిపైనే హత్యాయత్నం చేసింది.




తిరుపతి, అక్టోబర్ 5 (ఈవార్తలు): స్థానికుల కథనం ప్రకారం కేవీబీపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక, 18 ఏళ్ల యువకుడు ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త చనిపోవడంతో బాలిక తల్లి (40) కూడా వారితోనే కలిసి ఉంటోంది. ఈ క్రమంలో ఆమె తన అల్లుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ బంధం ముదిరి ఏకంగా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం రాత్రి కూతురు చూస్తుండగానే ఆమె భర్త చేత తాళి కట్టించుకోవడానికి తల్లి ప్రయత్నించింది. తన భర్త తల్లి మెడలో తాళి కడుతుండటాన్ని చూసి ఆ బాలిక అడ్డుకుంది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి, అల్లుడు కలిసి ఆమెపై దాడికి తెగబడ్డారు. రోకలి బండ తీసుకుని బాలిక తలపై బలంగా కొట్టారు. బాధితురాలి ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకుని బాలికను కాపాడారు. జరిగిన దారుణం తెలుసుకుని తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానికులు.. ఆ తల్లి, అల్లుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.



## విజయవాడ-హైదరాబాద్ హైవే బిజీ

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. దసరా సెలవులు ముగియడంతో పల్లెవాసులు నగరబాట పట్టారు. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఒకదాని వెంట మరొకటి బారులు తీరాయి. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. ఆదివారం అర్ధరాత్రి వరకు వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. మరోవైపు ప్రయాణికులతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.



ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మునుపెన్నడూ లేని విధంగా 1,25,245.57 డాలర్ల ( ఒక బిట్‌కాయిన్ విలువ రూ.1.11 కోట్లు) వద్ద ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది ఆగస్టు మధ్యలో నమోదైన 1,24,480 డాలర్ల రికార్డును ఇది అధిగమించింది.

## రాశి ఫలాలు

6.10.2025

మేషం: దీర్ఘ కాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి తగిన విశ్రాంతి లభించదు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయాణాలలో మార్గఅవరోదాలు కలుగుతాయి. బంధు మిత్రుల వలన కొన్ని ఊహించని సమస్యలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృషభం: వృత్తి ఉద్యోగాలలో సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. బంధు మిత్రులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యార్థుల ఫలితాలు ఉత్సాహనిస్తాయి. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు.

మిధునం: దూరప్రాంత బంధు మిత్రుల నుండి అందిన ఒక వార్త ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపార పరంగా మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు.

కర్కాటకం: చేపట్టిన పనులల్లో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. స్థిరాస్తి సంబంధిత ఒప్పందాలలో ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారపరంగా ఆశించిన లాభాలు అందుకుంటారు.

సింహం: దూరప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు మరింత చికాకు కలిగిస్తాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో ఒడిదుడుకులు తప్పవు. చేపట్టిన వ్యవహారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కన్య: వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నిరుద్యోగులుకు అరుదైన అవకాశములు లభిస్తాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. జీవిత భాగస్వామి నుండి ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

తుల: భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఇంటా బయట అందరితో సఖ్యతగా వ్యవహరిస్తారు. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది. శత్రు సమస్యలు నుండి ఉపశమనం పొందుతారు. స్థిరాస్తి వివాదాలు రాజీ అవుతాయి.

వృశ్చికం: పెద్దల ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. వృత్తి ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఇతరుల విషయాలలో తొందరపడి మాట ఇవ్వటం మంచిది కాదు. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం ఉండదు.

ధనస్సు: బంధుమిత్రుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులు మరింత కష్టపడవలసి వస్తుంది. గృహమున కొన్ని పరిస్థితులు చికాకు పరుస్తాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి.

మకరం: ఉద్యోగాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో సమస్యలను తెలివిగా పరిష్కరించి లాభాలను అందుకుంటారు.

కుంభం: నేత్ర సంభందిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపార ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి.

మీనం: విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగాలలో నూతన హోదాలు పొందుతారు. ఆత్మీయులతో కొన్ని కీలక విషయాల గురించి చర్చిస్తారు. ధనదాయం పెరుగుతుంది.



# నేపాల్‌లో భారీ వర్షాలకు 51 మంది బలి

ఖట్మండు: నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య 51కి చేరింది. తూర్పు నేపాల్‌లో గత24 గంటల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో ఈ మరణాలు సంభవించాయి. అత్యధికంగా ఇల్లాం జిల్లాలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. సూర్యోదయ, మంగ్సేబంగ్, దేవ్ మై ప్రాంతాల్లోనూ మరణాలు నమోదయ్యాయి. పలువురు గాయపడగా అనేకమంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యంతో పాటు పోలీసులు, ఇతర సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లోని వానలకు కాశ్ మాండూ లోయలోని భాగమతి, బిష్ణుమతి సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లోకి వరదనీరు చేరుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లపై ప్రయాణాలు చేయవద్దని ప్రజలను అధికారులు సూచించారు. కాఠ్ మాండూ సహా అనేక జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసి, ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల పొరుగుదేశం భూటాన్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదీ పరివాహ ప్రాంతాల్లో ఆకస్మిక వరదల కారణంగా వేలమంది ప్రజలు వరదల్లో చిక్కుకుపోయారు. దీంతో అక్కడి ప్రజలకు సహాయం అందించేందుకు భారత సైన్యం రంగంలోకి దిగింది. భూటాన్ అధికారులు, భారత సైనికులు సంయుక్తంగా చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

### ప్రధాని మోదీ సంతాపం

నేపాల్‌లో సంభవించిన ప్రకృతి విపత్తుపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్ ప్రజలకు భారత్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అక్కడి ప్రజలకు అవసరమైన సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఎక్స్ వేదికగా తెలిపారు.

# రేషన్ డీలర్లూ పోటీకి అర్హులే

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి. మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం–1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు. స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది. అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్టంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలంటే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరీని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్) అయితే రూ.5 వేలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి. ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్).. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250.. సర్పంచ్ అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000.. వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి. ముఖ్యంగా అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్స్ తీసుకుని ఉండాలి.

# ఈవీఎంలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది. "అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తు



పట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, ఒకటి, రెండు దశల్లోనే వీటిని పూర్తి చేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకుముందు (2015లో) ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ఇటీవల వెల్లడించింది.

# డార్జిలింగ్‌లో 18 మంది మృతి

### భయపెడుతున్న కుండపోత.. కుప్పకూలిన కీలక వంతెన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కుండపోత వానల కారణంగా మిరిక్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతి బీభత్సానికి పర్యాటక ప్రాంతాలైన మిరిక్, కుర్సియాంగ్‌లను కలిపే కీలకమైన దూదియా ఐరన్ బ్రిడ్జి పూర్తిగా కుప్పకూలింది. దీంతో ఆ ప్రాంతాల మధ్య రవాణా సంబంధాలు తెగిపోయాయి. కుర్సియాంగ్ సమీపంలోని జాతీయ రహదారి 110పై ఉన్న హుస్సేన్ ఖోలా వద్ద కూడా కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనల కారణంగా పలు గ్రామాలకు వెళ్లే మార్గాలతో పాటు జాతీయ రహదారులు కూడా బురదతో నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డార్జిలింగ్, కాలింపాంగ్, కూచ్‌బెహార్, జల్‌పైగురి, అలీపుర్‌దువార్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉప–హిమాలయ పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షాలు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ తన బులెటిన్‌లో పేర్కొంది. జార▯ండ్ పశ్చిమ ప్రాంతం, దాని పరిసరాల్లో కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం వల్లే ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ అల్పపీడనం క్రమంగా బలహీనపడి బీహార్ వైపు కదులుతుందని అంచనా వేసింది. దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, బీర్‌భూమ్, నాడియా జిల్లాల్లో కూడా సోమవారం వరకు భారీ వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయని, అత్యధికంగా బంకురాలో 65.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

## తల్లి మందలించిందని..

## కిరాతకంగా చంపేసిన బీటెక్ కుమారుడు

మొదటి పేజీ తరువాయి

నగర్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. నిందితుడు యశ్వంత్ రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు యశ్వంత్ మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్లే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఉన్నత చదువులు చదివిన కొడుకే తల్లి పాలిట యముడిగా మారడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# త్వరలోనే 5జీ బీఎస్ఎన్ఎల్

### వచ్చే 6-8 నెలల్లో అందుబాటులోకి సేవలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రస్తుతం దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ నెట్‌వర్క్‌ను రాబోయే 6 నుంచి 8 నెలల్లోనే 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. ఈ మార్పుతో త్వరలోనే బీఎస్ఎన్ఎల్ కూడా ప్రైవేట్ టెలికాం సంస్థలకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఆదివారం ఢిల్లీలో జరిగిన 'కౌటిల్య ఎకనామిక్ సదస్సు 2025'లో ఆయన మాట్లాడుతూ ఈ కీలక ప్రకటన చేశారు. భారతదేశం తన సొంత 4జీ ప్రమాణాలతో సాంకేతిక రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించిందని, ఇది దేశ ఆవిష్కరణ సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. "ఇంతటితో మేము ఆగిపోము. రాబోయే 6–8 నెలల్లో ఈ 4జీ టవర్లను 5జీ నెట్‌వర్క్‌గా మారుస్తాం. దేశవ్యాప్తంగా ఎండ్–టు–ఎండ్ 5జీ సేవలను అందిస్తాం" అని సింధియా స్పష్టం చేశారు. గత నెలలో బీఎస్ఎన్ఎల్ ప్రారంభించిన 'స్వదేశ్ 4జీ నెట్‌వర్క్' లేదా భారత్ టెలికాం స్టాక్‌ను పూర్తిగా భారతదేశంలోనే రూపొందించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్, తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ సహకారంతో ఈ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశారు. ఈ ఘనతతో, సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐదు దేశాల సరసన భారత్ చేరిందని ఆయన గుర్తుచేశారు. 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బీఎస్ఎన్ఎల్ మళ్లీ లాభాల బాట పట్టిందని సింధియా తెలిపారు. కేవలం ఏడాది కాలంలోనే సంస్థ చందాదారుల సంఖ్య 78 లక్షల నుంచి 2.2 కోట్లకు పెరిగిందని వివరించారు. ఈ కొత్త నెట్‌వర్క్ ద్వారా ఇప్పటికే 26,700 గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ లెర్నింగ్, స్మార్ట్ వ్యవసాయం, టెలిమెడిసిన్ వంటి సేవలు మరింత విస్తృతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

# బస్తర్ ప్రజలకు 10వేల రేడియో సెట్‌లు

రాయ్‌పూర్: మావోయిస్టు రహిత దేశంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రభావిత ప్రాంతాల్లో అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మావోల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రజల్లో మావోయిస్టు భావజాలాన్ని తొలగించి.. వారికి చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వారిలో జాతీయ భావనను పెంచేందుకుగాను భద్రతా దళాలు రేడియో సెట్‌లను అందించే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా నాలుగు నెలల్లో దాదాపు 10వేలకు పైగా రేడియో సెట్‌లను అక్కడి స్థానికులకు పంపిణీ చేశాయి. మావోయిస్టుల నిర్మూలనకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర హోంశాఖ.. బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా అనేక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ సాయంతో వందలాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తాజాగా రేడియో సెట్‌లను పంపిణీ చేసి.. ప్రధాని మోదీ ప్రతినెల సామాన్యులతో సంభాషించే మన్–కీ–బాత్‌తోపాటు వివిధ ప్రభుత్వ పథకాలు, వినోద కార్యక్రమాలను వినేలా ఏర్పాట్లు చేసింది. మొత్తంగా అక్కడ మోహరించిన 180 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలకు 60 రేడియోల చొప్పున కేటాయించగా.. వాటిని మారుమూల ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 54వేల మందిని ప్రధాన స్రవంతికి చేరువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో రేడియో సెట్ ఖరీదు రూ.1500గా అంచనా. బ్యాటరీలు లేదా కరెంటుతో పనిచేసేలా ఈ రేడియోలను రూపొందించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# పీజీ మెడికల్ విద్యార్థులకు తీవ్ర నష్టం

## ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలి.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోంది

**సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ**



హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.

**బీజేపీ, కాంగ్రెస్ మోసగాళ్లు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ 'బడే భాయ్, చోటా భాయ్' అని, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో వారిద్దరిదీ ఒకే తీరని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకరిది మోసపు చరిత్ర అయితే, మరొకరిది ద్రోహపు చరిత్ర అని, ఈ రెండు పార్టీలు తెలంగాణ పాలిట శత్రువులని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, "కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు కృతజ్ఞత కూడా చూపలేదు. నల్లధనం తెచ్చి రూ.15 లక్షలు ఇస్తామన్న హామీ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మాట ఏమైంది?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. రూ.350 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200కు, రూ.65 ఉన్న పెట్రోల్‌ను రూ.100కు పెంచింది బీజేపీ కాదా? అని నిలదీశారు. ఎన్నికలు రాగానే ధరలు తగ్గించినట్లు డ్రామాలు ఆడి, ఎన్నికలు ముగియగానే మళ్లీ పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. "నమ్మి ఓటేసిన ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి నట్టేట ముంచుతున్నారు. కేసీఆర్ హయాంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు నేడు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియాను సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని దుయ్యబట్టారు. తెలంగాణ రైతులంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. కష్టకాలంలో తెలంగాణకు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రమే శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు.

## బస్సు చార్జీల పెంపు దారుణం: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): జంట నగరాల్లో సిటీ బస్సు చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్కేసారి కనీస చార్జీని ఏకంగా 10 రూపాయలు పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు చార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస చార్జీపై ఏకంగా 50 శాతం పెంచడం దారుణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల బస్ పాస్ చార్జీలు, టీ-24 టికెట్ ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలపైనా భారం మోపుతోందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం విఫలమవడం వల్లే ఆర్టీసీ దివాళా తీసిందని, ఇప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాజధాని వాసులపై రోజుకు కోటి రూపాయల భారం మోపే ఈ నిర్ణయం, హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఉన్న కక్షను స్పష్టం చేస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# క్రీడలు, చదువు.. పోలీస్ స్కూల్!

**విలువలతో కూడిన విద్యకు క్రీడలు, సృజనాత్మకతల జోడింపు**

**అంతర్జాతీయ ప్రమాణాల 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'**

**2026-27 విద్యాసంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం**



హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): విలువలతో కూడిన విద్యకు క్రీడలు, సృజనాత్మకత తోడైతే విద్యార్థి బంగారు భవితకు సోపానం అవుతుంది. ప్రాథమిక దశలోనే క్రమశిక్షణ అలవరిస్తే ఉత్తమ పౌరుడిగా మారేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ అంశాల మేళవింపుతో రూపుదిద్దుకున్నదే 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్- హైదరాబాద్' (వైఐపీఎస్-హెచ్). విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను చిన్నతనంలోనే వెలికితీయడం... తద్వారా లక్ష్యాన్ని నిర్దేశించుకునేలా ప్రోత్సహించడం... గమ్యాన్ని చేరేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడం... ఇదే ఈ విద్యాసంస్థ ఉద్దేశం. ఆర్మీ స్కూల్, సైనిక్ స్కూల్, డిఫెన్స్ అకాడమీల్లా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి 1-6 తరగతుల్లో ప్రవేశాల ప్రక్రియను తాజాగా ప్రారంభించిన నేపథ్యంలో విద్యాసంస్థ ప్రత్యేకతలపై కథనం... తరగతి గదిలోనే కాకుండా క్రీడా మైదానంలోనూ చిన్నారుల్ని రాటుదేల్చడం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం కలిగించాలనే సంకల్పంతో రాష్ట్రం ప్రభుత్వం ఈ పాఠశాలను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో సువిశాల ప్రాంగణంలో దీన్ని నెలకొల్పారు. తొలుత ఐదు తరగతులతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థలో ఇప్పటికే ఒక బ్యాచ్ పూర్తయింది. రెండో బ్యాచ్ కోసం ప్రవేశాల ప్రక్రియను తాజాగా ప్రారంభించారు. ఈ విద్యాసంస్థలో 18 మంది నిపుణులైన ఉపాధ్యాయులున్నారు. పోలీస్ కుటుంబాలకు చెందిన పిల్లలకు 50% సీట్లను... ఇతరులకు మిగిలిన సీట్లను కేటాయించారు. పోలీస్‌శాఖకు సంబంధించి హోంగార్డు మొదలుకొని ఐపీఎస్ అధికారుల పిల్లల వరకు అందరికీ అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతానికి విద్యార్థుల రాకపోకల కోసం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల నుంచి బస్సు సదుపాయం కల్పించారు. భవిష్యత్తులో వసతిగృహాలను అందుబాటులోకి తీసుకువచ్చే యోచనతో ఉన్నారు. పాఠశాల నిర్వహణ కోసం పోలీస్‌శాఖలోని ఉన్నతాధికారులు, విద్యా నిపుణులు తదితరులతో సలహా మండలిని నియమించారు. భవిష్యత్తులో 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న క్యాంపస్‌లో 5 వేల సీట్లతో పాటు 1,750 పడకలతో వసతిగృహం ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. విద్యాసంస్థ అభివృద్ధికి తొలుత రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.5 కోట్లను మంజూరు చేసింది. సీఎస్ఆర్ కింద రూ.100 కోట్ల మేర నిధులు సమీకరించే యోచనలో ఉంది. పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు. అంతర్జాతీయ బోధన విధానాల్ని అనుసరిస్తున్నారు. తరగతి గదిలో డిజిటల్ అక్షరాస్యతను అనుసంధానించే ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలతో కూడిన డిజిటల్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం కోసం మైక్రోసాఫ్ట్ వంటి ప్రఖ్యాత సంస్థల సహకారం తీసుకుంటున్నారు. క్రీడల నిర్వహణకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)తోపాటు ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. పోలీస్ కుటుంబాల పిల్లలకు ఏటా రూ.50 వేలు.. ఇతరులకు రూ.1.6 లక్షల వార్షిక రుసుంగా నిర్ణయించారు. తరగతి గదిలో విజ్ఞాన సముపార్జనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడానికి 'ఇగ్నైట్' పేరిట పలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 'నేను చేయగలను... నేను చేస్తాను... నేను ఉన్నాను...' అనే బలమైన నమ్మకాన్ని వారిలో కలిగిస్తున్నారు. శారీరక దృఢత్వానికి రాక్ క్లైంబింగ్, జిప్ లైన్, మార్షల్ ఆర్ట్స్, ఫుట్‌బాల్ టర్ఫ్, స్విమ్మింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. మ్యూజిక్, ఆర్ట్, డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా స్టూడియోలను కేటాయించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచడం ద్వారా నాయకత్వ లక్షణాల్ని పెంపొందించే చర్చలు, ఇష్టాగోష్ఠులు, విజువల్ ఎయిడ్స్‌ను ఉపయోగిస్తూ ప్రసంగించడం లాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరిచేందుకు రివర్స్ ఇంజినీరింగ్ ఛాలెంజ్‌లను నిర్వహిస్తున్నారు. జీవన నైపుణ్యాలను పెంపొందించడంలో భాగంగా కుకింగ్, బేకింగ్ వంటివి నేర్పించడంతోపాటు ఇంటి ఖర్చులను సమర్థంగా నిర్వహించడం వంటి అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రకృతితో మమేకం చేయించడంతోపాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహనకు మొక్కల్ని నాటించడం, పెంపుడు జంతువుల సంరక్షణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నారు. మట్టితో కుండల్ని, బొమ్మల్ని తయారు చేయించడంతోపాటు రాక్ పెయింటింగ్ చేయిస్తున్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా పలుచోట్ల వర్షం



హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లక్డీకపూల్, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లోయర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, కుత్బుల్లాపూర్, చింతల్ సాయినగర్, మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అత్యధికంగా 11 సెం.మీ వర్షపాతం నమోదైంది. లింగాల(ఖమ్మం)లో 10సెం.మీ, మొగడంపల్లి(సంగారెడ్డి)లో 9.8 సెం.మీ, పల్లెగూడెం(ఖమ్మం)లో 8.98 సెం.మీ, మేడారం(ములుగు)లో 8.43 సెం.మీ, పుల్కల్(సంగారెడ్డి)లో 7.45 సెం.మీ, గూడూర్(జనగామ)లో 7.38 సెం.మీ, వికారాబాద్ జిల్లా ఖాసింపూర్, బషీరాబాద్‌లో 7 సెం.మీ, పెరుమాండ్ల-సంకీస(మహబూబాబాద్)లో 7 సెం.మీ, కొండాపూర్(సంగారెడ్డి)లో 6.48 సెం.మీ, మోమిన్‌పేట్(వికారాబాద్)లో 6.35 సెం.మీ వర్షపాతం, కూనారం(పెద్దపల్లి)లో 6.18 సెం.మీ, కాసిందేవిపేట(ములుగు)లో 8.78 సెం.మీ వర్షపాతం నమోదైంది. తెలుగు రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్ బిహార్ నుంచి తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో చాలా ప్రాంతాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉంది. కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల భారీ వర్ష సూచన ఉంది. ఈశాన్య, వాయవ్య అరేబియా సముద్రంలో శక్తి తీవ్ర తుపానుగా కొనసాగుతోంది. ద్వారకకు తూర్పుగా 530 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రేపు ఒమన్‌లో తీవ్రతుపాను తీరం దాటే అవకాశం ఉంది.

# త్వరలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**

**సీసీఐ ప్రతినిధులు, మిల్లర్లతో నేడు సమావేశం**



హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణ పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాబోయే వారంలోనే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. తన నివాసంలో పత్తి కొనుగోళ్ల అంశంపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఈ నెల 6వ తేదీన సీసీఐ సీఎండీ, కాటన్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో మరోసారి సమావేశమవుతానని మంత్రి వెల్లడించారు. జిన్నింగ్ మిల్లులు సీసీఐ టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల కొనుగోళ్ల ప్రక్రియలో ఏర్పడిన సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని తెలిపారు. సీసీఐ అధికారులు, మిల్లర్లతో సచివాలయంలో రెండు దఫాలు సమావేశం నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి హెచ్చరించారు. "రాబోయే వారం రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి కొనుగోళ్లు ప్రారంభం కావాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. గత సంవత్సరం అమలు చేసిన విధానాలను ఈ సీజన్‌లోనూ కొనసాగించాలని మిల్లర్లకు సూచించామని మంత్రి తెలిపారు. లింట్ శాతం, ఎల్-1 స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ వంటి అంశాలపై అభ్యంతరాలు వచ్చినా, కొన్ని నిబంధనల్లో సడలింపులు ఇచ్చి, మిగతావన్నీ యథాతథంగా అమలు చేస్తామని సీసీఐ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# చేయిచ్చేదెవరికో..?

**జూబ్లీహిల్స్ బరిలో నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు**

**అధిష్ఠానం ఆమోదానికి పంపిన టీపీసీసీ**

**రేసులో నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు, అంజన్‌కుమార్**

**ఢిల్లీకి వెళ్లిన భట్టి, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం తన కసరత్తును పూర్తి చేసి, నలుగురు ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపనుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ పెద్దల నిర్ణయంపైనే నిలిచింది. పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిన తుది జాబితాలో నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు. ఈ నలుగురిలో ఒకరిని ఏఐసీసీ ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించనుంది. స్థానికంగా బలమైన, గెలుపు గుర్రం అని భావించిన వారికే టికెట్ దక్కే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో, రాష్ట్రానికి చెందిన కీలక నేతలు ఢిల్లీకి పయనం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఢిల్లీకి వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులతో చర్చించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలుస్తోంది. త్వరలోనే ఉపఎన్నిక షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో, వీలైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి దూసుకెళ్లాలని కాంగ్రెస్ యోచిస్తోంది. దీంతో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఎవరిని వరిస్తుందనేది సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

## ప్రజల రక్తం పీలుస్తున్నారు: కవిత

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సామాన్య ప్రజలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. "గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యుల రక్తాన్ని పీల్చేస్తోంది. బస్సు ఎక్కడమే పాపం అన్నట్లుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారు" అని కవిత తన పోస్టులో తీవ్రంగా విమర్శించారు. ఇటీవలే బస్సు పాస్‌ల ధరలను పెంచి చిరుద్యోగులు, విద్యార్థులపై పెనుభారం మోపిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బస్సు చార్జీలను అమాంతం పెంచేయడం దారుణమని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణాను ప్రజలకు దూరం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## వంచించిన కానిస్టేబుల్.. యువతి ఆత్మహత్య

**ఉద్యోగం నుంచి శాశ్వతంగా డిస్మిస్ చేసిన ఎస్పీ**

గద్వాల, అక్టోబర్ 5 (ఈవార్తలు): ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఓ కానిస్టేబుల్ కారణంగా దళిత యువతి ప్రాణాలు తీసుకున్న విషాద ఘటన గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు (డిస్మిస్) ప్రకటించారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ప్రియాంక (32), గద్వాల జిల్లా చిన్నోనిపల్లికి చెందిన రఘునాథ్ గౌడ్ హైదరాబాద్‌లోని ఒక శిక్షణ కేంద్రంలో కలుసుకున్నారు. పెళ్లి చేసుకుంటానని ప్రియాంకను నమ్మించిన రఘునాథ్ ఆమెతో సన్నిహితంగా ఉన్నాడు. అయితే, కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిన తర్వాత మాట మార్చి పెళ్లికి నిరాకరించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక జూలై 17న తొలిసారి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పట్లో పోలీసులు రఘునాథ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రియాంక.. రఘునాథ్ ఇంటికి వెళ్లి అక్కడే ఉండటం మొదలుపెట్టింది. దీంతో అతడి కుటుంబసభ్యులు తమ నివాసాన్ని మల్దకల్‌కు మార్చారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రియాంక మరోసారి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించగా, చికిత్స అనంతరం డిశ్చార్జి అయింది. ఆ తర్వాత మల్దకల్‌లోని రఘునాథ్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారితో గొడవపడింది. అక్కడి నుంచి చిన్నోనిపల్లికి తిరిగివచ్చి, కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకుని తాగింది. సమాచారం అందుకున్న డీఎస్పీ ఆమెను గద్వాల ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం ఆమె కన్నుమూసింది. ప్రియాంక మృతికి కానిస్టేబుల్ రఘునాథ్ గౌడ్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు 22 మంది కారణమంటూ మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు స్పందిస్తూ, నిందితుడైన రఘునాథ్ గౌడ్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశామని, తాజాగా ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తున్నామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## జీఎస్టీ పెంచి.. తగ్గించినట్లు డ్రామాలు: హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): మోసగించడం, దోచుకోవడంలో కాంగ్రెస్, భాజపా దొందూ దొందేనని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఒక పార్టీది మోస చరిత్ర, మరో పార్టీది ద్రోహ చరిత్ర అన్నారు. చోటా భాయ్, బడే భాయ్ ఇద్దరిదీ ఒకే తీరు అని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల భాజపా నేతలు హరీశ్‌రావు సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో సంగారెడ్డి జడ్పీ స్థానం తమ పార్టీదే అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో గులాబీ జెండా ఎగురుతుందని చెప్పారు. భాజపా, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే అని పేర్కొన్నారు. "8 మంది ఎంపీలను గెలిపించారన్న కృతజ్ఞత కూడా భాజపాకు లేదు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలే కేంద్రానికి ప్రాధాన్యం. జీఎస్టీ పెంచింది మీరే.. తగ్గించినట్లు డ్రామాలు ఆడుతున్నది మీరే. తెలంగాణకు కేసీఆర్, భారత రాష్ట్ర సమితినే శ్రీరామరక్ష. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు బుద్ధి చెప్పాలి" అని హరీశ్‌రావు అన్నారు

## బస్టాండులే షాపింగ్ మాల్స్

**ఏ వ్యాపారమైనా నిర్వహించుకునేలా వెసులుబాటు**

**రాష్ట్రంలోని అన్ని ప్రధాన బస్టాండ్లలో ఏర్పాటుకు నిర్ణయం**

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): రాష్ట్రంలోని బస్‌స్టాండ్లను షాపింగ్‌మాల్స్ మాదిరిగా మార్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు ప్రారంభించింది. ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లు, వస్త్ర దుకాణాలు, స్వీట్‌షాప్, సర్వీస్ సెంటర్లు... ఇలా ఏ తరహా వ్యాపారమైనా చేసుకోవడానికి వెసులుబాటు ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండే సమయంలో షాపింగ్ చేసుకునేలా.. ఊర్లకు వెళ్లేవారు వారికి కావల్సిన వస్తువుల్ని బస్‌స్టాండ్లలోనే కొనేలా వాటి రూపురేఖలు మార్చాలని భావిస్తోంది. ఎంజీబీఎస్, జేబీఎస్ సహా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట తదితర బస్‌స్టాండ్లలో లీజుకు తీసుకునే స్థలానికి అద్దె చాలా ఎక్కువగా ఉంది. వేలంపాట వేసి వాటిని కేటాయిస్తున్నారు. ఏ దుకాణంలో ఏ వస్తువులు అమ్మాలో అధికారులు ముందే నిర్ణయిస్తున్నారు. బస్టాండ్లలో నీళ్లబాటిళ్లు, కూల్‌డ్రింక్‌లు, టిఫిన్లు, స్నాక్స్ వంటివి మాత్రమే లభిస్తున్నాయి.



# తిరుమలలా శ్రీశైలం



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలాన్ని ఒక ప్రధాన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, అవసరమైన సౌకర్యాల కల్పన కోసం 2,000 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. ఈ నెల 16న శ్రీశైలం పర్యటనకు రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈ అంశంపై చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు.

## శ్రీశైలం ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్లు

**కేంద్రాన్ని అటవీభూమి కోరనున్న కూటమి ప్రభుత్వం**

**16న శ్రీశైలానికి ప్రధాని.. ఈ అంశంపై చర్చించనున్న సీఎం**

శ్రీశైలం/అమరావతి, అక్టోబర్ 5 (ఈవార్తలు): ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దేవాదాయ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. శ్రీశైలానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ సహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఏటా లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "తిరుమల తర్వాత శ్రీశైలం రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ వసతి కూడా లేదు. భూమి అందుబాటులో లేకపోతే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం అసాధ్యం" అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2,000 హెక్టార్ల అటవీ భూమిని దేవాదాయ శాఖకు బదలాయించాలని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖను కోరాలని నిర్ణయించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి వివరించేందుకు ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని కూడా సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న శబరిమల వంటి పుణ్యక్షేత్రాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధ్యయనం చేసి, శ్రీశైలంలో ఆ తరహా ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రతిపాదించారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా శ్రీశైలానికి జాతీయ రహదారులతో అనుసంధానం కల్పించాలని సీఎం సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల మీదుగా జాతీయ రహదారులను ఆలయానికి అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. అయితే, అభివృద్ధి పనులతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన నొక్కిచెప్పారు. ఆలయాల చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాలను కాపాడతామని, పచ్చదనాన్ని పెంచేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్యను పెంచేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

## ఉత్తరాంధ్రపై వైసీపీ ఫోకస్

**ప్రభుత్వ విధానాలపై ఉద్యమానికి పిలుపు**

**ఉత్తరాంధ్ర వైసీపీ నేతల కీలక సమావేశం**

వైజాగ్, అక్టోబర్ 5 (ఈవార్తలు): ఏపీలోని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేసేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు సంబంధించిన విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించింది. ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ఎంపీలు గొల్ల బాబురావు, తనూజ రాణి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సమావేశం అనంతరం కన్నబాబు మాట్లాడుతూ, కేవలం జగన్‌కు వచ్చిన మంచి పేరును చెరిపేందుకే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని తీవ్రంగా ఆరోపించారు. చంద్రబాబు పాలన అంటేనే మోసం అని, కబుర్లు చెప్పడం తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదని విమర్శించారు. కూటమి పాలనలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగడం ఖాయమని ఆయన ఆరోపించారు. ఈ నెల 9వ తేదీన జగన్ నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శిస్తారని కన్నబాబు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగదని, లేదా మూసివేత తప్పదని స్వయంగా కేంద్ర మంత్రే చెప్పారని అన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు మాట మార్చారని ధ్వజమెత్తారు. "చంద్రబాబు నిజం చెబితే ఆయన తల పగిలిపోతుంది" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ నాయకత్వంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు భారీ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 800 కోట్లతో కిడ్నీ ఆసుపత్రి కట్టించామని, మూలపేట పోర్టులో 90 శాతం పనులు పూర్తిచేశామని తెలిపారు. తాము చేసిన పనులను చెప్పుకోవడంలో వెనుకబడ్డామని, ఇప్పుడు టీడీపీ నేతలు వాటిని తామే చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు.

## మహిళలకు పెద్దపీట వేయండి

**జనసేన నేతలకు పవన్ సూచనలు**



విజయవాడ, అక్టోబర్ 5 (ఈవార్తలు): ప్రజాప్రతినిధులుగా మనమందరం యువత, మహిళల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన, రహదారుల నిర్మాణం, అభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, డంపింగ్ యార్డుల ఏర్పాటు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటికి అవసరమైన ప్రాజెక్టుల సాధన, నిధుల సమీకరణపై ప్రతి శాసన సభ్యుడు అధ్యయనం చేసి ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జనసేన పార్టీ శాసన సభా పక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పాలన, రాజకీయపరమైన అంశాలపై పవన్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ 5 నియోజకవర్గాల చొప్పున బాధ్యత తీసుకొని పార్టీ శ్రేణులతో మమేకం కావాలని సూచించారు. జన సైనికులు, వీర మహిళలకు భరోసా కల్పించే దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఈ క్రమంలో వారితోపాటు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని, తద్వారా ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు సంక్షేమం ఏ విధంగా చేరుతుంది, అక్కడి యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఏ విధంగా కల్పించాలి, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం లాంటి విషయాలపై దృష్టి సారించాలని తెలిపారు. అదే సందర్భంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కల్పిస్తున్న రహదారుల కల్పన, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, కూటమి ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన, రహదారుల అభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, డంపింగ్ యార్డుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం శాసన సభాపక్షం నుంచే ఒక్కో అంశంపై ఒక్కో కమిటీ వేసుకొందామన్నారు. ఆరు వారాల్లోగా ఆయా కమిటీలు నివేదికలు అందించాలని తెలిపారు. కూటమి పార్టీలపరంగా నియోజకవర్గాల్లో మూడు పార్టీల సమన్వయ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలన్నారు. ఆ సమావేశాల్లో కూటమి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకొనేలా ముందుకు వెళ్లాలని, ఈ క్రమంలో సమష్టిగా ఆలోచనలు చేసి, ఒక్కటిగా గళం వినిపించాలన్నారు. కూటమిని బలపరుస్తూనే మన పార్టీని బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని, ఇందుకోసం మన పార్టీ తరఫున త్రిశూల్ వ్యూహాన్ని అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే తెలియచేస్తానన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాధ్యతల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి. సార్వత్రిక ఎన్నికల్లో మనకు బలం ఉన్న నియోజకవర్గాల్లోనూ పొత్తు ధర్మం ప్రకారం పోటీకి దూరంగా ఉన్నామని, అక్కడి మన కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఒక్కొక్కరికి అప్పగిస్తున్న అయిదు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని, పార్టీ శ్రేణులతో మమేకం కావాలని, స్థానిక ఎన్నికల్లో యువతకు, కొత్త నాయకత్వానికి ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు.


## ఇది న్యాయమేనా చంద్రబాబు?

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?**

**టీడీపీ దందా బయటపడ్డది**

**ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు**

**వైసీపీ అధినేత జగన్ ధ్వజం**



తాడేపల్లి, అక్టోబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ నేతృత్వంలో వ్యవస్థీకృతంగా నకిలీ మద్యం దందా జరుగుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం సిండికేట్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని, ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో టీడీపీ నేతలు నిర్వహిస్తున్న కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీ పట్టుబడటమే రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలకు నిదర్శనమని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఒక వ్యూహం ప్రకారం రద్దు చేసి, ఆ స్థానంలో టీడీపీ నేతల సిండికేట్లకు అప్పగించారని ఆరోపించారు. "మద్యం దుకాణాలు, బెల్టు షాపులు, అక్రమ పర్మిట్ రూమ్‌లు అన్నీ టీడీపీ నేతలవే. వారే నకిలీ మద్యం తయారు చేసి, వారి దుకాణాల ద్వారా అమ్మి, అక్రమ సంపాదనను పంచుకుంటున్నారు" అని జగన్ విమర్శించారు. మద్యం అమ్మకాలపై కాగ్ నివేదికలను ప్రస్తావిస్తూ జగన్ గణాంకాలను వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం అమ్మకాల ద్వారా రూ. 6,782.21 కోట్ల ఎక్సైజ్ ఆదాయం రాగా, 2025-26లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా అమ్మకాలు పెంచినా కేవలం రూ. 6,992.77 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇది కేవలం 3.10 శాతం పెరుగుదల మాత్రమేనని, సహజంగా రావాల్సిన 10 శాతం వృద్ధి కూడా లేకపోవడం వెనుక భారీ దోపిడీ దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయమంతా సిండికేట్ల రూపంలో టీడీపీ నేతల జేబుల్లోకి వెళుతోందని ఆయన పేర్కొన్నారు. ములకలచెరువు ఘటనలో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న జిల్లా స్థాయి టీడీపీ ఇన్‌ఛార్జిని కాపాడేందుకు, విదేశాల్లో ఉన్న వ్యక్తిపై నెపం నెట్టి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతోనే రాత్రికి రాత్రే కేసును మార్చేశారని, ఈ దందాకు ప్రభుత్వ పూర్తి సహకారం ఉందని ఆరోపించారు. సొంత ఆదాయం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం న్యాయమేనా అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



## దివ్యాంగుల దర్శన టికెట్లు ఆపేయలేదు: టీటీడీ

తిరుమల, అక్టోబర్ 5 (ఈవార్తలు): శ్రీవారి దర్శనానికి సంబంధించి వయోవృద్ధులు, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తులకు స్పష్టం చేసింది. కొన్ని నెలలుగా వ్యాప్తి చెందుతున్న ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం దర్శన సౌకర్యాన్ని ఆపేశారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని టీటీడీ తేల్చిచెప్పింది. ప్రతినెలా మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో 1000 టికెట్ల కోటాను విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ కోటాలో టికెట్లు పొందిన వారికి ఉచితంగా లడ్డూ ప్రసాదాన్ని కూడా అందిస్తున్నామని వివరించింది. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని నంబి ఆలయం వద్ద ఉన్న ప్రత్యేక లైన్ ద్వారా వీరిని దర్శనానికి అనుమతిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా, అలిపిరి మెట్ల మార్గంలో మద్యం తాగిన వ్యక్తులు గాజు సీసాలు పగలగొట్టి భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వస్తున్న మరో ఆరోపణను కూడా టీటీడీ తీవ్రంగా ఖండించింది. ఆ ఘటన అలిపిరి నుంచి రుయా ఆసుపత్రికి వెళ్లే మార్గంలో జరిగిందే తప్ప, టీటీడీ పరిధిలోని నడకమార్గంలో కాదని స్పష్టం చేసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకే ఇలాంటి అసత్యాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. భక్తులు ఇలాంటి వదంతులను నమ్మకుండా, కేవలం టీటీడీ అధికారిక వెబ్ సైట్లైన %అతీబఝ్రీఖ.శీతీస్త్ర% లేదా %ఎవఝుర్ష్టుఖఎం.ఖజూ.స్త్రశీజ.అఅ% ద్వారా మాత్రమే సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించింది. సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## రాప్తాడులో పరిటాల ట్యాక్స్

**ప్రజలు బెంబేలెత్తుతున్నారు.. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణంలో కమీషన్లు**

**తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఆరోపణలు**

రాప్తాడు, అక్టోబర్ 5 (ఈవార్తలు): ఏపీలోని రాప్తాడు టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీతను లక్ష్యంగా చేసుకుని వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలో 'పరిటాల ట్యాక్స్'తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేగా ఆమెపై ఉందని, ఆమె ఏమీ మైసూర్ మహారాణి కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఇళ్ల నిర్మాణంలో భారీ కుంభకోణం జరుగుతోందని తోపుదుర్తి ఆరోపించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి రూ. 10 వేల చొప్పున కమీషన్ దండుకుంటున్నారని విమర్శించారు. ఈ అవినీతిపై విచారణ జరిపే దమ్ము, ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లకు ఉందా? అని ఆయన సవాల్ విసిరారు. పరిటాల సునీత, ఆమె కుమారుడు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా దోచుకుంటున్నారని తోపుదుర్తి ఆరోపించారు. వారి కుటుంబానికి వేల కోట్ల అక్రమాస్తులు ఉన్నాయని, పండగ నాడు ఎనిమిది కార్లకు, గన్‌లకు ఆయుధ పూజలు చేయడం ప్రజలను దోచుకున్న సొమ్ముతో కాదా? అని ప్రశ్నించారు. ధర్మవరం చేనేత వ్యాపారులను బెదిరించి కోట్లాది రూపాయలు వసూలు చేశారని కూడా ఆయన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ హామీల అమలు గురించి ప్రశ్నించిన వారికి 'చెప్పు తెగుద్ది' అంటూ పరిటాల సునీత బెదిరింపులకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా ఇళ్ల నిర్మాణం ఎందుకు ఆగిపోయిందని అడిగితే ఇలాంటి సమాధానాలు ఇస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తిరగబడితే ఎవరి చెప్పులైనా తెగుతాయని సునీత గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

## తుపాకీతో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

**సహోద్యోగుల కళ్లెదుటే ఈ ఘోర ఘటన**



వైజాగ్, అక్టోబర్ 5 (ఈవార్తలు): వైజాగ్‌లోని అత్యంత కీలకమైన భీమిలి నౌకాదళ కేంద్రం (ఐఎన్ఎస్ కళింగ) ప్రాంగణంలో తీవ్ర కలకలం రేగింది. విధుల్లో ఉన్న ఓ డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ (డీఎస్‌సీ) జవాన్, తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనతో క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాపట్ల జిల్లాకు చెందిన బాజీ బాబా షాహిక్ (44) డీఎస్‌సీ సిపాయిగా ఐఎన్ఎస్ కళింగలో విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఉదయం డ్యూటీలో ఉండగా, తన వద్ద ఉన్న ఏకే-47 సర్వీస్ రైఫిల్‌తో అకస్మాత్తుగా కాల్చుకున్నారు. ఆయనతో పాటు విధుల్లో ఉన్న తోటి సిబ్బంది, సహోద్యోగులు ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కళ్లెదుటే జరిగిన ఈ ఊహించని పరిణామంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే అప్రమత్తమై, తీవ్రంగా గాయపడిన షాహిక్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షాహిక్ ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నారు. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత కారణాలు లేదా మానసిక ఒత్తిడి ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి, సహోద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి విచారణ తర్వాతే ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

## రిలే దీక్షలు కొనసాగుతాయి

**పీహెచ్‌సీ వైద్యుల స్పష్టీకరణ**

**ప్రభుత్వంతో చర్చలు విఫలమయ్యాయని వెల్లడి**

అమరావతి, అక్టోబర్ 5 (ఈవార్తలు): పీహెచ్‌సీ వైద్యులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. వైద్యుల డిమాండ్‌కు ప్రభుత్వం పూర్తిస్థాయి అంగీకారం తెలపకపోవటంతో.. వైద్యులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నామని తెలిపారు. విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్‌తో పీహెచ్‌సీ వైద్యులు రెండు దఫాలుగా చర్చలు జరిపారు. పీజీ ఇన్ సర్వీస్ 20 శాతం కోటాను అన్ని విభాగాల్లో ఏడాది పాటు కొనసాగించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆరోగ్య శాఖ కమిషనర్ అన్నారు. అయితే పీహెచ్‌సీ వైద్యులు ఐదేళ్లు అమలు చేయాలని డిమాండ్ చేశారని తెలిపారు. వారి పదోన్నతులను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. సుమారు వెయ్యి మంది వైద్యులు ఈ కోటాలో పీజీకి వెళ్లారని తెలిపారు. ఏటా వీరి సంఖ్య పెరిగితే వారికి ఉద్యోగాలివ్వటం కష్టసాధ్యమవుతుందన్నారు. ఖాళీ పోస్టుల ఆధారంగా కోటాను నిర్ణయించాలని.. దీని ప్రకారం ఎప్పటికప్పుడు కోటా శాతం మారాల్సిన అవసరం ఉంటుందన్నారు. వైద్యుల అన్ని డిమాండ్లకు అంగీకారం తెలుపుతున్నా.. వాళ్లు మొండి పట్టు పట్టడం సరికాదన్నారు. కొందరు వైద్యులు తమకు లబ్ధి చేకూరట్లేదనే అభిప్రాయంతో ఒప్పుకోవట్లేదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కమిషనర్ కోరారు. మరోవైపు తమ డిమాండ్లను పూర్తి స్థాయిలో ప్రభుత్వం అంగీకరించనందున తాము రిలే దీక్షలు కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు డా.రవీంద్ర నాయక్ తెలిపారు.

# 1 బిట్ కాయిన్ విలువ 1.11 కోట్లు



## ఆల్ టైమ్ రికార్డ్ సృష్టించిన వైనం
## వరుసగా ఎనిమిదో సెషన్ కూడా లాభాల్లోనే

**ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మునుపెన్నడూ లేని విధంగా 1,25,245.57 డాలర్ల ( ఒక బిట్‌కాయిన్ విలువ రూ.1.11 కోట్లు) వద్ద ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది ఆగస్టు మధ్యలో నమోదైన 1,24,480 డాలర్ల రికార్డును ఇది అధిగమించింది.**




న్యూయార్క్: వరుసగా ఎనిమిది సెషన్ల పాటు లాభాల బాటలో పయనిస్తున్న బిట్‌కాయిన్, అమెరికా ఈక్విటీ మార్కెట్లలో సానుకూల పవనాలు, బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌లోకి (ఈటీఎఫ్) భారీగా నిధులు ప్రవహించడంతో ఈ రికార్డును అందుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం క్రిప్టో ఆస్తులలో పెట్టుబడులను సులభతరం చేసేలా నిబంధనలను సవరించడం, సంస్థాగత పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు మొగ్గు చూపడం వంటివి ఈ బుల్ రన్‌కు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. స్టేబుల్‌కాయిన్లపై నిబంధనలను ఆమోదించడం, డిజిటల్ ఆస్తులకు అనుగుణంగా యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నిబంధనలను మార్చడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపింది. మరోవైపు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా యూఎస్ డాలర్ విలువ ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే బలహీనపడింది. ఇది కూడా బిట్‌కాయిన్ పెరుగుదలకు పరోక్షంగా దోహదపడింది. సాధారణంగా బిట్‌కాయిన్ 'హాల్వింగ్' ఈవెంట్ తర్వాత ఇలాంటి దీర్ఘకాలిక ర్యాలీలు చోటుచేసుకుంటాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్' (డబ్ల్యూఎల్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌తో ఒక క్రిప్టోకరెన్సీ ఒప్పందంపై దృష్టి సారించిందని 'డిస్ఇన్ఫో ల్యాబ్' నివేదించింది. పాకిస్థాన్ కొత్తగా ఏర్పాటు చేసిన క్రిప్టో కౌన్సిల్ సీఈఓగా ఉన్న బిలాల్ బిన్ సాఖిబ్, అదే సమయంలో డబ్ల్యూఎల్ఎఫ్‌కు కూడా సలహాదారుగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. జూన్ 2025లో పాకిస్థాన్ ప్రభుత్వం డబ్ల్యూఎల్ఎఫ్, బినాన్స్‌లతో కలిసి బ్లాక్‌చెయిన్ మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ఒప్పందాలు చేసుకున్న విషయం తెలిసిందే.



# పాక్‌కు సహకరించేదే లేదు!

**భారత్‌ను ఇబ్బందిపెట్టే చర్యలు తీసుకోం**

**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్**



మాస్కో: భారత్ తమకు చిరకాల మిత్రుడని చెబుతూనే పాకిస్థాన్ తో రష్యా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటోందని, యుద్ధ విమానాలకు ఇంజన్లు సరఫరా చేస్తోందని జరుగుతున్న ప్రచారాన్ని వ్లాదిమిర్ పుతిన్ కొట్టిపారేశారు. భారతదేశానికి ఇబ్బందికరంగా మారే చర్యలను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ చేపట్టబోమని స్పష్టం చేశారు. యుద్ధ విమానాల సరఫరా కోసం పాకిస్థాన్ తో తాము ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని పేర్కొన్నారు. భారత్‌తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. పాక్‌కు మద్దతుగా తాము చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారాలు చేయడం సరికాదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే.. ఈ విషయంపై అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం. పాకిస్థాన్ సైన్యం వాడుతున్న జేఎఫ్ -17 ఫైటర్ జెట్ల (చైనా తయారీ) కు అవసరమైన ఇంజన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. ఈ నివేదికలను ఉటంకిస్తూ.. కాంగ్రెస్ పార్టీ బీజేపీపై మండిపడింది. ప్రధాని మోదీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని, కానీ ఆ దేశం మన శత్రు దేశమైన పాక్‌కు మద్దతిస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని మోదీ వైఫల్యాన్ని సూచిస్తుందని విమర్శించారు. జాతీయ ప్రయోజనాల కంటే ప్రధాని మోదీ తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యతనిస్తారని దుయ్యబట్టారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో మోదీ ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇప్పటికీ దౌత్యం విషయంలో పాక్‌ను ఒంటరిని చేయలేకపోతున్నారని జైరాం రమేశ్ విమర్శించారు.

# బీహార్‌లో బురఖా లొల్లి!

పాట్నా: అసెంబ్లీ ఎన్నికల వేళ బీహార్ లో బురఖాపై వివాదం నెలకొంది. ఓటు వేసేందుకు బురఖాలో వచ్చే మహిళలను ఓటర్ కార్డులోని ఫొటోతో సరిపోల్చుకోవాలని బీజేపీ చేసిన డిమాండ్ పై ప్రతిపక్ష ఆర్జేడీ నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే (ఎస్ఐఆర్) చేపట్టి ఓటర్ జాబితాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన నేపథ్యంలో బురఖాపై అభ్యంతరం చెప్పడం అర్థరహితమని వాదిస్తున్నారు. విద్వేష రాజకీయాలు చేయడం మానుకోవాలని బీజేపీ నేతలకు హితవు పలికారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా బీహార్ లో ఎన్నికల సంఘం అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా పార్టీల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ఈ సమావేశంలో పాల్గొన్న బీజేపీ బీహార్ చీఫ్ దిలీప్ జైస్వాల్ మాట్లాడుతూ.. ఓటు వేయడానికి బురఖాలో వచ్చే మహిళలను ఓటర్ కార్డులోని ఫొటోతో సరిపోల్చుకోవాలని ఈసీని డిమాండ్ చేశారు. దొంగ ఓట్లను అరికట్టేందుకు ఇది తప్పనిసరిగా చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. దిలీప్ జైస్వాల్ వ్యాఖ్యలపై ఆర్జేడీ తరఫున మీటింగ్ కు హాజరైన ఎంపీ అభయ్ కుశ్వాహా అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ డిమాండ్ అర్థరహితమని, రాజకీయ కుట్ర అని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే నిర్వహించిందని గుర్తుచేశారు. తాజా ఫొటోతో ఓటర్ కార్డులను జారీ చేసిన నేపథ్యంలో బురఖాలో వచ్చే మహిళలను కార్డులోని ఫొటోతో సరిపోల్చుకోవాల్సిన అవసరం లేదని అభయ్ కుశ్వాహా వాదించారు.

# కేబీసీలో రైతుకు 50 లక్షలు

ముంబై: పంట పొలాల్లో నిత్యం శ్రమించే ఓ రైతు అమితాబ్ బచ్చన్ నిర్వహించే 'కౌన్ బనేగా కరోడ్ పతి (కేబీసీ)' షో లో పాల్గొని పెద్ద మొత్తం గెల్చుకున్నారు. వరదలు, చీడ పీడలతో పంట నష్టపోయిన ఆ రైతును అదృష్టం కేబీసీ రూపంలో వరించింది. షో లో అమితాబ్ అడిగిన 14 ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పి రూ.50 లక్షలు గెల్చుకున్నారు. కోటి రూపాయల ప్రశ్న విషయంలో జవాబు తెలియక రిస్క్ వద్దనుకుని పోటీ నుంచి తప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన కైలాశ్ కుంటేవార్ తన కేబీసీ అనుభవం గురించి మీడియాతో మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను చదువులో ముందుండే వాడినని చెప్పారు. కేబీసీ షో వినోదం కోసమేనని భావించేవాడినని, 2018లో ఈ షోలో డబ్బు గెల్చుకున్న వ్యక్తితో మాట్లాడాక సీరియస్ గా దీనిపై దృష్టి సారించానని చెప్పారు. అప్పటి నుంచి కేబీసీ కోసం ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడించారు. రోజంతా పొలంలో కష్టపడ్డా ఇంటికి వచ్చాక కనీసం ఒక గంటపాటు కేబీసీ కోసం ప్రిపేర్ అయినట్లు కైలాశ్ తెలిపారు. షోలో అమితాబ్ అడిగిన ప్రశ్నలకు వరుసగా సరైన జవాబులు చెబుతూ 50 లక్షలు గెల్చుకున్నానని, కోటి రూపాయల ప్రశ్న విషయంలో కొంత సందిగ్ధం నెలకొందని చెప్పారు. దీంతో రిస్క్ తీసుకోలేక అప్పటి వరకు గెల్చుకున్న 50 లక్షలతో పోటీ నుంచి తప్పుకున్నట్లు కైలాశ్ వివరించారు. తాను గెల్చుకున్న సొమ్మును ఖర్చు చేసే విషయంలో పిల్లల చదువులకే ప్రథమ ప్రాధాన్యమిస్తానని కైలాశ్ తెలిపారు.

# తమిళనాడుకు భారీ వర్ష సూచన

చెన్నై: తమిళనాడులో పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తనున్నాయి. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో నేడు కుండపోత వర్షాలు కురుస్తాయని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఆర్ఎంసీ) హెచ్చరిక జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం మదురై, రామనాథపురం, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, తిరుపత్తూరు, నమక్కల్, తిరుచిరాపల్లి, దిండిగల్, థేని, విరుదునగర్, శివగంగ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. దక్షిణ ద్వీపకల్పం, దాని పరిసర ప్రాంతాలపై కొనసాగుతున్న అల్పపీడనం కారణంగానే ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవస్థ బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి తేమను ఎక్కువగా గ్రహిస్తుండటంతో వర్ష తీవ్రత పెరుగుతోందని తెలిపారు. శనివారం కూడా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. కృష్ణగిరి జిల్లాలోని హొసూరులో అత్యధికంగా 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, దిండిగల్‌లో 11 సెం.మీ., విల్లుపురం జిల్లాలోని అవలూరుపేట, సెమ్మేడు ప్రాంతాల్లో 10 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. ఇక రేపటి నుంచి 10వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు కోరారు.





# గాల్లోనే తెరుచుకున్న ఎమర్జెన్సీ టర్బైన్

**యూకేలో ఎయిర్ ఇండియా వి మానం సేఫ్ ల్యాండింగ్**

లండన్: ఎయిర్ ఇండియా విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు బయలుదేరిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానంలో గాల్లో ఉండగానే సాంకేతిక సమస్య తలెత్తింది. విమానం ల్యాండింగ్ కోసం కిందకు దిగుతున్న సమయంలో దాని అత్యవసర పవర్ యూనిట్ అయిన 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్ఏటీ) అకస్మాత్తుగా తెరుచుకుంది. అయితే, పైలట్ల చాకచక్యంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటన శనివారం ఏఐ117 విమానంలో చోటుచేసుకుంది. బర్మింగ్‌హామ్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న క్రమంలో విమానం ర్యామ్ ఎయిర్ టర్బైన్ పనిచేయడం ప్రారంభించినట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై ఎయిర్ ఇండియా ఒక ప్రకటన విడుదల చేసింది. "అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళ్తున్న ఏఐ117 విమానం ల్యాండింగ్ సమయంలో ర్యామ్ ఎయిర్ టర్బైన్ తెరుచుకున్నట్లు మా సిబ్బంది గుర్తించారు. ఆ సమయంలో విమానంలోని ఎలక్ట్రికల్, హైడ్రాలిక్ వ్యవస్థలన్నీ సాధారణంగానే పనిచేస్తున్నాయి. విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది" అని ఎయిర్ ఇండియా తెలిపింది. ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని బర్మింగ్‌హామ్‌లోనే నిలిపివేసి, నిపుణులతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. ఈ కారణంగా, బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరాల్సిన ఏఐ114 విమాన సర్వీసును రద్దు చేసినట్లు వెల్లడించింది.

# దగ్గు మందు డాక్టర్ అరెస్టు


**తమిళనాడు కంపెనీపై కేసు**




భోపాల్: మధ్యప్రదేశ్‌లో 11 మంది చిన్నారుల మృతికి కారణమైన కల్తీ దగ్గు మందు ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. చిన్నారులకు వివాదాస్పద 'కోల్డ్రిఫ్' సిరప్‌ను సూచించిన ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్ సోనీని పోలీసులు ఈ ఉదయం అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు. ఛింద్వారా జిల్లాలోని పరాసియా ప్రాంతంలో చాలా మంది చిన్నారులు డాక్టర్ ప్రవీణ్ సోనీ వద్ద చికిత్స తీసుకున్నారు. ప్రభుత్వ వైద్యుడైన ఆయన తన ప్రైవేట్ క్లినిక్‌కు వచ్చిన చిన్నారులకు ఈ సిరప్‌ను సూచించినట్లు తెలుస్తోంది. ఈ సిరప్ వాడిన తర్వాత చిన్నారుల ఆరోగ్యం విషమించి మరణించడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ దగ్గు మందును తయారు చేసిన తమిళనాడు కాంచీపురం జిల్లాకు చెందిన శ్రీసన్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కోల్డ్రిఫ్ సిరప్‌పై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిషేధం విధించింది. చెన్నైలోని డ్రగ్ టెస్టింగ్ ల్యాబొరేటరీలో జరిపిన పరీక్షల్లో ఈ సిరప్ శాంపిల్స్‌లో 48.6 శాతం డైఇథిలీన్ గ్లైకాల్ అనే అత్యంత విషపూరిత రసాయనం ఉన్నట్లు తేలింది. దీంతో ఈ మందు 'ప్రామాణిక నాణ్యతతో లేదని' తమిళనాడు డ్రగ్ కంట్రోల్ డైరెక్టరేట్ ప్రకటించింది. ముందు జాగ్రత్త చర్యగా 'నెక్స్ట్రో-డీఎస్' అనే మరో సిరప్ అమ్మకాలను కూడా స్థానిక యంత్రాంగం నిలిపివేసింది. బాధిత కుటుంబాల కథనం ప్రకారం సెప్టెంబర్ ఆరంభంలో చిన్నారులకు జలుబు, జ్వరం రావడంతో వారికి దగ్గు మందు ఇచ్చారు. మొదట కోలుకున్నట్లు కనిపించినా, కొద్ది రోజులకే లక్షణాలు తిరగబెట్టాయి. ఆ తర్వాత హఠాత్తుగా మూత్ర విసర్జన పూర్తిగా తగ్గిపోయి, కిడ్నీ సమస్యలు తలెత్తి చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. కిడ్నీ బయాప్సీ పరీక్షల్లో డైఇథిలీన్ గ్లైకాల్ ఆనవాళ్లు కనిపించడంతో కల్తీ మందే కారణమని నిర్ధారణ అయింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "చిన్నారుల మరణాలు అత్యంత విషాదకరం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ సిరప్‌తో పాటు దాని తయారీ కంపెనీకి చెందిన ఇతర ఉత్పత్తుల అమ్మకాలపై కూడా నిషేధం విధిస్తున్నాం. నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. మధ్యప్రదేశ్‌తో పాటు రాజస్థాన్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కూడా కోల్డ్రిఫ్ సిరప్‌ను నిషేధించాయి.

# నిజమే! ఖలిస్థానీలకు నిధులు

ఒప్పుకున్న కెనడా సర్కారు




ఒట్టావా: ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థలకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయన్న వాస్తవాన్ని కెనడా ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించింది. ఈ మేరకు దేశంలోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఫండింగ్‌పై విడుదల చేసిన ఒక కీలక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. సేవా సంస్థల ముసుగులో జరుగుతున్న ఈ నిధుల మళ్లింపుపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కెనడా ఆర్థిక శాఖ ఇటీవల విడుదల చేసిన "అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్ ఇన్ కెనడా 2025" నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్ వంటి ఖలిస్థానీ వేర్పాటువాద గ్రూపులతో పాటు హమాస్, హెజ్‌బొల్లా వంటి సంస్థలు కూడా కెనడాలోని వ్యక్తులు, సంస్థల నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ఖలిస్థానీ ఉగ్రవాదం నుంచి పొంచి ఉన్న ముప్పును ఈ నివేదిక హమాస్, హెజ్‌బొల్లా వంటి సంస్థలతో పోల్చడం గమనార్హం. కెనడాలోని పలు నాన్-ప్రాఫిట్, ఛారిటబుల్ సంస్థలకు వస్తున్న విరాళాలను ఉగ్ర కార్యకలాపాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. దీనిపై అక్కడి ఓ స్థానిక రేడియో స్టేషన్ అధిపతి మణీందర్, ప్రధాని మార్క్ కార్నీతో పాటు పలువురు నాయకులకు గతంలోనే లేఖ రాసి ఫిర్యాదు చేశారు. సేవా సంస్థల ముసుగులో ఉగ్రవాద స్లీపర్ సెల్స్ పనిచేస్తున్నాయనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ, బబ్బర్ ఖల్సా ఉగ్రవాది తల్వీందర్ సింగ్ పర్మర్ కుమారుడు నురిందర్ సింగ్ పర్మర్ కేసును అధికారులు పరిశీలిస్తున్నారు. నురిందర్ ఒక నాన్-ప్రాఫిట్ సంస్థలో పనిచేస్తూ తన పూర్తి పేరును దాచిపెట్టినట్లు తేలింది. ఈ పరిణామాల నేపథ్యంలో కెనడా ప్రభుత్వం ఉగ్రవాద ఫండింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భారత్‌తో భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇటీవలే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడం ఈ దిశగా తీసుకున్న కీలక చర్యగా భావిస్తున్నారు. మొత్తంగా, ఖలిస్థానీ నెట్‌వర్క్‌కు ఆర్థిక మూలాలను దెబ్బతీయడంపై కెనడా ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది.

# హమాస్‌కు నెతన్యాహు వార్నింగ్

**వింటారా? బలప్రయోగం చేయమంటారా?**

**ట్రంప్ శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షిక అంగీకారం**

**నేడు ఈజిప్టులో ఇజ్రాయెల్-హమాస్ చర్చలు**



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షికంగా అంగీకరించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను నిరాయుధీకరణ చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఈ లక్ష్యాన్ని మంచి మాటలతో అయినా లేదా సైనిక చర్యతో అయినా సాధించి తీరతామని ఆదివారం స్పష్టం చేశారు. ఈ పరిణామం గాజా శాంతి చర్చల భవిష్యత్తుపై కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో తెరపైకి వచ్చిన శాంతి ప్రణాళికలో భాగంగా యుద్ధాన్ని ముగించడం, బందీల విడుదల, గాజా పునర్నిర్మాణం వంటి కొన్ని అంశాలకు హమాస్ శుక్రవారం రాత్రి అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో నెతన్యాహు విడుదల చేసిన ఒక వీడియో సందేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. "ట్రంప్ ప్రణాళిక ప్రకారం దౌత్యపరంగా లేదా మా సైనిక మార్గంలో హమాస్‌ను నిరాయుధీకరణ చేస్తాం. గాజాను నిస్సైనికీకరణ చేసి తీరతాం. ఇది సులభంగా జరగవచ్చు లేదా కఠినంగానైనా మేం చేసి చూపిస్తాం" అని నెతన్యాహు హెచ్చరించారు. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్న ప్రాంతాల నుంచి పూర్తిగా వైదొలగే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు, బందీల విడుదల విషయంలో నెతన్యాహు ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం ఒక గొప్ప విజయం అంచున ఉన్నాం. రాబోయే కొద్ది రోజుల్లో, సుక్కోత్ పండుగ సమయంలోపే మన బందీలందరూ (మరణించినవారితో సహా) తిరిగి వస్తారనే శుభవార్తను మీకు అందించగలనని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఈ అంశంపై సోమవారం ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. కాగా, శాంతి చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రాథమికంగా వెనక్కి వెళ్లేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, హమాస్ ధ్రువీకరించిన వెంటనే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

వయ్యారి చిత్రం





## కాంతార రికార్డుల మీద రికార్డులు

కన్నడ టాలెంటెడ్ నటుడు అలాగే దర్శకుడు రిషబ్ శెట్టి హీరోగా తన దర్శకత్వంలోనే తెరకెక్కించిన అవైటెడ్ డివోషనల్ చిత్రమే "కాంతార 1". మంచి అంచనాలు నడుమ వచ్చిన ఈ సినిమా వాటిని అందుకొని భారీ రికార్డులు కన్నడ సినిమా నాట సెట్ చేస్తుంది. పాన్ ఇండియా లెవెల్లో రికార్డులు కొల్లగొడుతున్న ఈ చిత్రం సెన్సేషనల్ బుకింగ్స్ ని బుక్ మై షోలో నమోదు చేస్తోంది. ఇలా కాంతార 1 ఏకంగా ఇపుడు 5 మిలియన్ టికెట్ సేల్స్ ని జరుపుకొని మరో భారీ ఫీట్ ని సెట్ చేసి కన్నడ సినిమా దగ్గర ఇంకో రికార్డు ఖాతాలో వేసుకుంది. మరి ఈ ర్యాంపేజ్ ఇప్పట్లో కూడా ఆగేలా లేదనే చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా దీనికి ముందు సినిమాలో ఉన్న అందరు నటులు దాదాపు ఈ సినిమాలో కూడా ఉన్నారు

## త్వరలో అఖండ 2 ట్రైలర్!




నటసింహం బాలయ్య-బోయపాటి శ్రీను కాంబినేషన్లో వచ్చిన 'అఖండ' చిత్రం అద్భుత విజయాన్ని సాధించింది. దీంతో, 'అఖండ 2-తాండవం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉంది. ఐతే, తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ను రెడీ చేసినట్లు తెలుస్తోంది. ఈ ట్రైలర్.. గ్రాండ్ విజువల్స్ తో పాటు సాలిడ్ బిజీఎమ్ కూడా హైలైట్ గా ఉండబోతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ట్రైలర్ లో అఘోర టచ్ అండ్ ఎమోషన్ కూడా చాలా ఆకట్టుకుంటుందట. కాగా తమన్ స్వరాలు అందిస్తోన్న ఈ సినిమా డిసెంబర్ 05న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే, విడుదలైన ఈ సినిమా టీజర్ ట్రెండ్ సృష్టించిన విషయం తెలిసిందే. అఖండ 2- తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. మొత్తమ్మీద బాలయ్య అభిమానులు ఈ సినిమా పై కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మాస్ జాతర నుంచి మరో ప్రోమో సాంగ్

మాస్ మహారాజ రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు భాను బోగవరపు తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే "మాస్ జాతర". మంచి బజ్ లోనే ఉన్న ఈ సినిమా కోసం అభిమానులు చాలా కాలం నుంచి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఫైనల్ గా ఈ అక్టోబర్ లో రిలీజ్ కి వస్తున్న ఈ సినిమా నుంచి నెక్స్ట్ సాంగ్ కి రంగం సిద్ధం అయ్యింది. ఇది వరకే వచ్చిన రెండు పాటలు మంచి రెస్పాన్స్ ని అందుకున్నాయి. ఇక మూడో సాంగ్ గా హుడియో హుడియో అంటూ సాగే పాటని శ్రీలీల, రవితేజ మాస్ నెంబర్ గా ఇపుడు అనౌన్స్ చేసారు. ఇక ఈ సాంగ్ తాలూకా ప్రోమో రేపు అక్టోబర్ 6న ఉదయం 11 గంటల 8 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. సంగీత దర్శకుడు భీమ్స్ ఈసారి ఎలాంటి ట్యూన్ ని అందించాడో చూడాలి మరి. ఇక ఈ సినిమా థియేటర్స్ లో ఈ అక్టోబర్ 31న రిలీజ్ కాబోతుంది.



## కాంతార బ్యూటీకి ఛాన్స్...!?



కల్కి 2898 ఎ.డి. హీరోయిన్ దీపికా పడుకోన్ తప్పుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె స్థానంలో ఎవ్వర్ని తీసుకుంటారో అని ఫ్యాన్స్ లో చర్చ మొదలైంది. ప్రస్తుతం సాయి పల్లవి పేరు బాగా వినిపిస్తోంది. కానీ, ఈ వార్తలో వాస్తవం లేదని తెలుస్తోంది. ఐతే, 'కల్కి' సీక్వెల్ లో దీపికా స్థానాన్ని రుక్మిణీ వసంత్ తో భర్తీ చేయిస్తే బాగుంటుందని నాగ అశ్విన్ ఫీల్ అవుతున్నారట. 'కాంతార: చాప్టర్ 1' సినిమాలో తన సహజమైన నటనతో సినీప్రియుల మదిని దోచుకుంది రుక్మిణీ వసంత్. కాబట్టి, దీపిక పడుకోన్ స్థానాన్ని రుక్మిణీ వసంత్ భర్తీ చేయగలదు. ఐతే, మరోవైపు మాత్రం ఈ సినిమాలో హీరోయిన్ కోసం అనుష్క, నయనతార, అలియా భట్ లాంటి పేర్లు కూడా బాగా వినిపిస్తున్నాయి. మరి చివరకు ఏ హీరోయిన్ ఫైనల్ అవుతుందో చూడాలి. 'కల్కి సీక్వెల్'కు 'కర్ణ 3102 బీసీ' అనే టైటిల్‌ను ఖరారు చేస్తున్నారని టాక్. పైగా ఈ సీక్వెల్ లో పురాణాల లెంగ్త్ ఎక్కువగా ఉంటుందట. ఎలాగూ కల్కి ఎండింగ్ ను కూడా కర్ణుడు పాత్ర పై ముగించారు కాబట్టి, కల్కి సీక్వెల్ మొత్తం కర్ణ పాత్ర చుట్టూ తిరుగుతందనే అనుకోవాలి.

## మరోసారి హిమాలయాలకు రజనీకాంత్

రజినీకాంత్ మరొకసారి హిమాలయాల్లో దర్శనమిచ్చారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో సూపర్ స్టార్ మళ్లీ హిమాలయాలకు వెళ్లడం వెనుక అసలు కారణం ఏంటి? అంటూ ఆరా తీయడం మొదలుపెట్టారు. సాధారణంగా సూపర్ స్టార్ రజినీకాంత్ ఆధ్యాత్మిక అనుభూతి, మానసిక ప్రశాంతత పొందడానికి తరచూ హిమాలయాలకు వెళ్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన మరొకసారి హిమాలయాలకు బయలుదేరారు. రిషికేశ్ ఆశ్రయంలో బసచేస్తూ బద్రీనాథ్, మహావతార్ బాబాజీ గుహ వంటి పవిత్ర స్థలాలను సందర్శించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు , వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో మళ్లీ సూపర్ స్టార్ హిమాలయాలకు వెళ్లారా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. రజినీకాంత్ హిమాలయాలకు వెళ్లడంపై స్పందిస్తూ.." ప్రతి సంవత్సరం ఇక్కడికి వస్తే నాకు ఒక కొత్త అనుభవం కలుగుతుంది. ఈసారి కూడా ఆ కొత్త ఆధ్యాత్మిక అనుభూతిని పొందడానికి ఎదురు చూస్తున్నాను. ప్రపంచం అంతటికీ ఆధ్యాత్మికత అవసరం. అది మనిషికి తృప్తిని, ప్రశాంతతను ఇస్తుంది. భగవంతుడి మీద విశ్వాసమే జీవితంలో సమతుల్యతను సాధిస్తుంది" అంటూ రజినీకాంత్ కామెంట్లు చేశారు.






## యూరప్‌కు రాజాసాబ్ టీం

ప్రభాస్ నటించిన ది రాజాసాబ్ మూవీ గురించి ఎంతోమంది ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే విడుదలవ్వాల్సి ఉండగా పలు కారణాల వల్ల చాలాసార్లు వాయిదా పడుతూ వస్తోంది. కానీ ఎట్టకేలకు ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కాబోతున్నట్టు అఫీషియల్ గా అనౌన్స్మెంట్ ఇచ్చారు. అప్పటినుండి ఈ సినిమాకి సంబంధించి మిగిలిన పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ది రాజాసాబ్ మూవీ గురించి నిర్మాత ఎస్కేఎన్ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు.. మరి ఆ పోస్ట్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. నిర్మాత ఎస్కేఎన్ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో డైరెక్టర్ మారుతీతో కలిసి ఉన్న ఫోటోని షేర్ చేశారు. అంతేకాదు చిత్ర యూనిట్ అందరూ కలిసి యూరప్ కి పయనమవ్వుతున్నట్టు వెల్లడించారు. అలాగే యూరప్ లో రెండు పాటలను చిత్రీకరిస్తున్నామని, ఈ చిత్రీకరణతో సినిమా ఎక్కువ భాగం షూటింగ్ పూర్తి అవుతుందని తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మాత ఎస్కేఎన్ ఇచ్చిన అప్డేట్ తో ప్రభాస్ అభిమానుల్లో మరింత ఉత్సాహం పెరిగింది.



మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు రెండో విజయం నమోదు చేసింది. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా ఈసారి పాకిస్థాన్‌ను మట్టికరిపించింది



# పాకిస్తాన్ ని... చిత్తు చిత్తుగా

**ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ తలపడ్డాయి. పాక్ ను భారత్ చిత్తు చిత్తుగా ఓడించింది. 88 పరుగుల తేడాతో పాక్ ను మట్టి కరిపించింది భారత్. 248 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన పాక్.. 159 పరుగులకే ఆలౌట్ అయ్యింది. సిద్రా ఆమిన్ (81) పోరాటం చేసినా మరో ఎండ్ లో సహకారం లేకపోవడంతో ఓటమి తప్పలేదు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్, దీప్తి శర్మ చెలరేగారు. తలో మూడు వికెట్లు తీశారు. స్నేహ్ రానా రెండు వికెట్లు పడగొట్టారు. ఈ టోర్నీలో భారత్ కు ఇది రెండో విజయం.**

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు రెండో విజయం నమోదు చేసింది. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా ఈసారి పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో పోరాడగలిగే స్కోర్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన ఆ తర్వాత దాయాది పని పట్టింది. క్రాంతి గౌడ్ (3-20) స్నేహ్ రానా(2-38)లు చక్కని బౌలింగ్‌తో వికెట్ల వేట కొనసాగించారు. దీప్తి శర్మ(3-45) చివరి వికెట్ తీయడంతో 88 పరుగుల తేడాతో భారత్ జయభేరి మోగించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో చిరకాల ప్రత్యర్థిపై 12 విజయాలతో పైచేయి సాధించింది.

తొలి వరల్డ్ కప్ వేటలో భారత జట్టు దూసుకెళుతోంది. ఆరంభ మ్యాచ్‌లో కో హోస్ట్ శ్రీలంకకు చెక్ పెట్టిన టీమిండియా.. రెండో గేమ్‌లో పాకిస్థాన్ భరతం పట్టింది. హర్లీన్ డియోల్ (46), రీచా ఘోష్ (35 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించి భారత్.. బంతితో పాక్ బ్యాటర్లను వణికించింది. ఛేదనలో ఆది నుంచి తడబడిన పాక్.. ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఆరు పరుగులకే ఓపెనర్ మునీబా అలీ(2) రనౌట్ కాగా.. ఆకాసేపటికే సడాఫ్ షమాస్ (6) రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. అనంతరం.. రేణుకా సింగ్ ఓవర్లో సిద్రా అమిన్ (9 నాటౌట్) ఇచ్చిన సులువైన క్యాచ్‌ను రీచా వదిలేసింది. డైవ్ చేయడంతో బంతి ఆమె మణికట్టుకు తగిలి కింద పడింది. లేదంటే పాక్ మూడో వికెట్ పడేది. పది ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయిన పాక్ ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. అలియా రియాజ్ (2) వెనుదిరిగాక నటాలియా పర్వేజ్(33), సిద్రా అమిన్(81)లు క్రీజులో పాతుకుపోయారు. భారత బౌలర్లను విసిగిస్తూ నాలుగో వికెట్‌కు హాఫ్ సెంచరీకిపైగా భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే%ా % 69 రన్స్ జోడించిన పర్వేజ్‌ను క్రాంతిగౌడ్ వెనక్కి పంపి పాక్‌ను కష్టాల్లోకి నెట్టింది. రాధా యాదవ్ చక్కగా క్యాచ్ అందుకోవడంతో పాక్ నాలుగో వికెట్ పడింది. కాసేపటికే అమిన్ సింగిల్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. కానీ, మరో ఎండ్‌లో ఆమెకు సహకరించేవాళ్లు కరువయ్యారు. సిద్రా నవాజ్ (14)ను రిటర్న్ క్యాచ్‌తో స్నేహ్ రానా డగౌట్ చేర్చగా.. ఆ వెంటనే షమీమ్(0)ను దీప్తి బౌల్డ్ చేసింది. ఒంటరిపోరాటం చేస్తున్న అమిన్ స్వీప్ షాట్ ఆడి మిడ్ వికెట్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చేతికి చిక్కడంతో పాక్ ఓటమి ఖాయమైంది. దీప్తి వేసిన 43 ఓవర్లో డయానా (9) రనౌట్ కాగా.. చివరి బంతికి సడియా (0) ఔట్ కావడంతో పాక్ 159 పరుగులకే ఆలౌటయ్యింది. వరుసగా రెండో విజయంతో నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది టీమిండియా.

## భవిష్యత్తు ప్రణాళికలు రోహిత్‌కు చెప్పి ఉండాల్సింది : అభిషేక్ నాయర్

భారత క్రికెట్‌లో ప్రస్తుతం రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తొలగించిన విషయం పెద్ద దుమారం రేపుతోంది. ఆస్ట్రేలియా పర్యటన కోసం జట్టును ప్రకటించినప్పుడు సెలెక్టర్లు అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను వన్డే కెప్టెన్‌గా నియమించారు. దీంతో విజయవంతమైన రోహిత్ శర్మ కెప్టెన్సీ శకం ముగిసింది. ఈ కీలక నిర్ణయం వెనుక జరిగిన కమ్యూనికేషన్‌పై రోహిత్ సన్నిహితుడు, మాజీ భారత క్రికెటర్ అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిట్ మ్యాన్ రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించడంపై అభిషేక్ నాయర్ స్పందిస్తూ.. బీసీసీఐ, సెలక్షన్ కమిటీ తమ భవిష్యత్ ప్రణాళికలను రోహిత్ శర్మకు పూర్తిగా వివరించి ఉండాలని అన్నారు. రోహిత్ కూడా జట్టు యాజమాన్యం ఆలోచనతో ఏకీభవించినట్లయితే.. కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి సమస్య ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ కీలకమైన చర్చ కేవలం ఒక ఫోన్ కాల్‌తో ముగిసేది కాదని అభిషేక్ నాయర్ స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి కమ్యూనికేషన్ ప్రక్రియకు సమయం పడుతుందని.. ఇది అన్ని పక్షాల మధ్య విస్తృతమైన చర్చ ద్వారానే జరగాలని తాను ఆశిస్తున్నట్లు వెల్లడించారు. "రోహిత్ శర్మతో చర్చ జరిగి, అందరూ ఒకే దిశలో ఆలోచిస్తున్నంత వరకు... సమస్య లేదు. ఈ మార్పు కేవలం ఒక ఫోన్ కాల్‌తో అయ్యేది కాదు, దీనికి సమయం పడుతుంది. శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇవ్వాలని జట్టు అనుకుంటే.. గిల్‌కు సహాయం చేయడానికి నేను డ్రెస్సింగ్ రూమ్‌లో ఉంటానని రోహిత్ కూడా స్వయంగా అంగీకరించి ఉండాలి. రోహిత్‌ను లూప్‌లో ఉంచి.. మీరు ఇప్పటివరకు చేసినట్లుగానే, ఈ జట్టును ముందుకు నడిపించడానికి మాకు సహాయం చేయండని బాధ్యతను ఇస్తే, ఇది గొప్ప నిర్ణయం అవుతుంది." అని అభిషేక్ నాయర్ పేర్కొన్నారు.



## రోహిత్‌కు అన్యాయం: మహ్మద్ కైఫ్

భారత క్రికెట్ లో కొత్త శకం ప్రారంభమైంది. టెస్టుల అనంతరం వన్డేల్లో కూడా శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తూ సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో రోహిత్ శర్మ వన్డే కెప్టెన్సీ ముగిసింది. ఆస్ట్రేలియా సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఎంపిక కాగా.. రోహిత్ శర్మ తనను తాను కేవలం ఆటగాడిగా నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వన్డేల్లో కెప్టెన్‌గా ప్రపంచకప్ గెలవాలనే రోహిత్ శర్మ కల ఈ నిర్ణయంతో చెదిరిపోయింది. అయితే ఈ నిర్ణయంపై మాజీ భారత క్రికెటర్ మహ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలెక్టర్లు, బీసీసీఐపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రోహిత్ శర్మకు మరింత సమయం ఇవ్వాల్సి ఉండేదని అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించడంపై మహ్మద్ కైఫ్ ఘాటుగూ స్పందించారు. ఈ నిర్ణయాన్ని చాలా తొందరపాటు చర్యగా ఆయన అభివర్ణించారు. "రోహిత్ శర్మ ఇండియాకు తన 16 ఏళ్లు ఇచ్చారు. కానీ కెప్టెన్‌గా మనం ఆయనకు ఒక్క సంవత్సరం కూడా ఇవ్వలేకపోయాం." అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియాలో చాలా మంది ఆటగాళ్లు తమ ఫామ్ నడుస్తున్నంత వరకు జట్టులో కొనసాగడానికి ప్రయత్నిస్తారని, కానీ రోహిత్ అలా చేయలేదని కైఫ్ ప్రశంసించారు. కెప్టెన్ గా ఒక ఐసీసీ టైటిల్ గెలిచినప్పటికీ.. ప్రపంచకప్ వరకు కూడా రోహిత్ శర్మకు అవకాశం ఇవ్వకుండా తొందరపాటు నిర్ణయం తీసుకున్నారని కైఫ్ బీసీసీఐపై మండిపడ్డారు.



## ఒక్క మెసేజ్‌తోనే వీడ్కోలు!

ఆస్ట్రేలియా పర్యటన కోసం జట్టు ఎంపికపై అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. ముఖ్యంగా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ వన్డే కెప్టెన్ గా కొనసాగుతారా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. జట్టులో రోహిత్ శర్మ పేరు ఉన్నప్పటికీ.. సెలెక్టర్లు శుభ్‌మన్ గిల్‌ను నూతన కెప్టెన్ గా ప్రకటించారు. ఈ క్రమంలో ఓ గొప్ప భారత కెప్టెన్సీ శకం ముగిసింది. రోహిత్ శర్మ ఇప్పుడు జట్టులో సభ్యుడిగా ఉంటారు కానీ, కెప్టెన్సీ బాధ్యతలు మాత్రం గిల్ చూసుకుంటాడు. జట్టు ఎంపిక అనంతరం బీసీసీఐ ఓ పోస్ట్ చేస్తూ.. రోహిత్ శర్మ కెప్టెన్సీ కెరీర్ ముగిసినట్లు సూచించింది. బీసీసీఐ తమ పోస్టులో.. "రో హిట్ ఎఫెక్ట్. ఆసియా కప్ 2023, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025. వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మ శకానికి వందనం." అని పేర్కొంది. ఈ సందేశం ద్వారా రోహిత్ కెప్టెన్సీ ముగింపు ఖరారైంది. కేవలం కొన్ని నెలల క్రితం ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన కెప్టెన్ కు కూడా తదుపరి ప్రపంచ కప్ వరకు అవకాశం ఇవ్వకపోవడం అభిమానులను నిరాశకు గురి చేసింది. కెప్టెన్‌గా , ఆటగాడిగా రోహిత్ ప్రదర్శన అద్భుతంగా ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకోవడంపై చాలా మంది దిగ్గజాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ శర్మ వన్డే కెప్టెన్‌గా మొత్తం 56 మ్యాచ్‌లు ఆడారు. భారత జట్టు ఆ మ్యాచ్‌లలో 42 విజయాలు సాధించింది.అతని విజయ శాతం 76 శాతంగా ఉంది, ఇది అత్యుత్తమ రికార్డు. చివరి 16 ఐసీసీ ఈవెంట్లలో టీమిండియా కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఓడిపోయింది. వన్డే ప్రపంచకప్ ఫైనల్ వరకు జట్టును తీసుకెళ్లినప్పటికీ, ట్రోఫీ గెలవాలనే రోహిత్ లక్ష్యం నెరవేరలేదు. తదుపరి ప్రపంచకప్ గెలిచి తన కెరీర్‌ను ముగించాలని రోహిత్ ఆశించినప్పటికీ, ఇప్పుడు అది సాధ్యం కాకపోవచ్చు.



## అగార్కర్-గంభీర్ ముద్ర

భారత క్రికెట్‌లో ఎందరో చీఫ్ సెలెక్టర్లను చూశాం. కానీ, సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన వాళ్లు మాత్రం కొందరే. ప్రస్తుతం ప్రధాన సెలెక్టర్ పదవిలో ఉన్న అజిత్ అగార్కర్ కచ్చితంగా రెండో కోవకే చెందుతాడు. ప్రతిసారి స్క్వాడ్ ఎంపికలో తనదైన ముద్ర వేస్తున్నాడీ మాజీ పేసర్. ఇంగ్లండ్ పర్యటనకు స్క్వాడ్ ఎంపిక నుంచి ఆసియా కప్.. ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ వరకూ అతడు తనదైన పంథాను కొనసాగిస్తున్నాడు. సీనియర్లకు చెక్ పెడుతూ భావితారలకు భరోసానిచ్చేలా స్క్వాడ్ ఎంపిక ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని చెప్పకనే చెబుతున్నాడు అగార్కర్. అందుకే.. తన నిర్ణయాలను కొంతమంది విమర్శించినా టీమిండియా ప్రయోజనాలే తనకు ముఖ్యమని మొండిగా ముందుకు వెళ్తున్నాడు అతడు. మాజీ పేసర్ అయిన అగార్కర్ 2023 జూలై 4న చీఫ్ సెలెక్టర్ పదవి చేపట్టాడు. అప్పటి నుంచి అతడి ప్రతి నిర్ణయం సీనియర్లను ఆశ్చర్యపరిచేలా.. జూనియర్లకు అవకాశాలు కల్పించేలా ఉంటోంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ సలహాలు, సూచనల్ని పాటిస్తూనే.. జట్టుకు ఉపయోగపడే ఆటగాళ్లను మాత్రమే తీసుకుంటున్నాడు అగార్కర్. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27ను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లండ్ పర్యటనకు కొత్త కెప్టెన్ అవసరమని భావించిన అతడు.. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు సంకేతాలు ఇచ్చాడు.

## లక్ష్యం వరల్డ్ కప్

రెండేళ్లలో వన్డే ప్రపంచకప్ ఉన్నందున రోహిత్‌ను కాదని.. గిల్‌కే పగ్గాలు అప్పగించింది అగార్కర్ బృందం. టెస్టుల్లో సమర్థుడైన నాయకుడిగా నిరూపించుకున్న గిల్.. వన్డేల్లోనూ టీమిండియాకు బెస్ట్ కెప్టెన్ అవుతడాని భావించడమే అందుకు కారణం. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ సన్నద్ధతకు గిల్‌కు సమయం కావాలి కాబట్టి.. ఆసీస్ సిరీస్‌తోనే అతడికి బాధ్యతలు ఇవ్వడం మంచిదని అతడు అనుకొని ఉంటాడు. తనదైన ముందు చూపుతో అగార్కర్ నిర్ణయాలు తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు సీనియర్లను బాధించినా.. జట్టు ప్రయోజనాల రీత్యా అతడిని తప్పు పట్టలేని పరిస్థితి. అందుకే.. కొందరు విమర్శిస్తున్నా.. చాలామంది మాత్రం అతడి ముక్కుసూటితనాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## గంభీర్ తాలూకా.. అందుకే చోటు:

ఆస్ట్రేలియా పర్యటనకు భారత జట్లను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లను టీమ్‌ఇండియా ఆడనుంది. అక్టోబర్ 19 నుంచి పర్యటన మొదలుకానుంది. ఈ క్రమంలో సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి జట్టులో స్థానం దక్కింది. వన్డే జట్టు సారథిగా మాత్రం రోహిత్ స్థానంలో శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసింది. అయితే, రెండు సిరీస్‌లకూ కామన్‌గా ఓ ప్లేయర్ మాత్రం చోటు సంపాదించడం గమనార్హం. ఇంతవరకూ అతడికి పెద్దగా అవకాశాలు రాలేదు. కేవలం జట్టుతోపాటు ఉండేందుకేనన్నట్లుగా ఆ కుర్రాడి పరిస్థితి తయారైంది. ఆ ప్లేయరే హర్షిత్ రాణా. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తాలూకా ప్లేయర్ అని మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ విమర్శించాడు. "హర్షిత్ రాణా భారత జట్టులో శాశ్వత ప్లేయర్.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 6-10-2025 | www.evarthalu.com



# రాముడు ఎలా గెలిచాడు?

**రామాయణం ప్రధాన లక్ష్యం రావణ వధ.. ఇది ఎలా జరిగింది? పురాణాల కథనాల ప్రకారం విష్ణుమూర్తి అప్పటికే ఆరు అవతారాలు ధరించాడు. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ అవతారాలన్నీ క్షణాల్లో ముగిసిపోయినా.. శత్రువును నిర్నిరోధంగా హతమార్చినవే ఈ అవతారాలన్నీ, ఒక్క పరుశు రాముడి అవతారం ముగించటానికి కొంత టైం పట్టిందేమో కానీ, ఏ అసురుడిని శిక్షించటానికైతే అవతారాన్ని ధరించాడో.. వచ్చిన పనిని సెకన్ల వ్యవధిలో కానిచ్చేసుకుని చక్కా వైకుంఠానికి వెళ్లిపోయాడు. తనను ఎదిరించే కనీస గడువు కూడా శత్రువుకు ఇవ్వకుండా అంతం చేసిన అవతారమూర్తి, రాముడిగా ఆవిర్భవించిన తరువాత ఆ నారాయణుడు దైవత్వాన్ని ఎందుకు ప్రదర్శించలేదు? రావణుణ్ణి తన దివ్యశక్తితో ఎందుకు సంహరించలేదు? దైవశక్తుల్ని ప్రయోగించనప్పుడు.. రావణుణ్ణి ఎలా చంపగలిగాడు?**

లంక ఓ మహా సామ్రాజ్యం.. బలవంతుడైన రాజు.. అత్యాధునిక ఆయుధ సంపత్తి.. సూపర్ సోనిక్ వెపన్స్.. సుశిక్షితమైన సేనావాహిని, చతురంగబలాలు.. ఒక్కొక్కరు వంద మందినైనా చంపగల యోధులు ఉన్న రావణుడు ఎదురులేని వాడు.. ముల్లోకాలను జయించిన వాడు.. నేలపై ఉండి యుద్ధం చేయగలడు.. ఏరియల్ అటాక్స్ చేయగలడు.. మిస్సైల్ టెక్నాలజీ తెలిసిన వాడు.. అలాంటి యోధుణ్ణి జయించటం ఎవరికైనా ఎలా సాధ్యం? ఈయనేమో పధ్నాలుగేళ్లు అడవుల్లో గడిపి వచ్చాడు. నారచీరలు.. కందమూలాల ఆహారం.. చేతిలో కోదండం.. అమ్ములపొదిలో బాణాలు.. వెన్నంటి ఉన్న అడవిలో తిరిగే వానరాలు.. రాళ్లూ రప్పలు విసరడం తప్ప కోతులకు యుద్ధ నైపుణ్యం ఎక్కడిది.. ఇద్దరు అన్నదమ్ముల దగ్గర ధనుర్బాణాలు తప్ప మరేవీ లేవాయె.. కనీసం రథం కూడా లేదు.. వెంట ఉన్న సైన్యమేమో.. అడవుల్లో తిరిగే కోతులు.. ఎలుగుబంట్ల జాతుల వారు.. వీరితో పాటు ఉత్తర భారతం నుంచి దక్షిణాపథం వరకూ వెంట వచ్చిన జనసమూహం ఉంది. సంఖ్య ఎక్కువే అయినా.. రావణుడి రణనీతి ముందు వీరంతా బలాదూరే. కోతి బుద్ధులు కోటి.. ఇలాంటి వాళ్లను వెంటేసుకుని వెళ్లిన రాముడు రావణాసురుని గెలవటం ఎలా సాధ్యమైంది? కేవలం దేవుడు కాబట్టే అలా జరిగిందా? కేవలం రాముడి దగ్గరే అంతులేని శక్తి ఉందా? లేక మరేదైనా కారణం ఉందా? రామావతారంలో ఎక్కడా దైవశక్తి ప్రదర్శన కొంచెం కూడా కనిపించదు. అలాంటప్పు డు రాముడి శక్తిసామర్థ్యాలు ఏపాటివి? ఆయన బలాబలాలు.. యుద్ధ వ్యూహాలు ఏమిటి? పోనీ అయోధ్యలో ఉన్నాడంటే.. అక్కడి సైన్యం తోడైనా ఉండేది.. కానీ, రాముడికి ఉన్న యుద్ధనీతి ఏమిటి? రావణుడి కడుపులో అమృతం ఉందని విభీషణుడు చెప్పటం.. లేదు లేదు.. ధర్మానికి విరుద్ధంగా.. నేను కడుపుపై బాణం వేయనని రాముడు అనటం.. హనుమంతుడు గాలిని పార్లించటం.. బాణం కాస్తా దారి మళ్లి కడుపులో గుచ్చుకోవటం ఇదంతా రామాయణ యుద్ధంలో వాస్తవంగా జరిగిందా? అసలు ఓ వ్యక్తి కడుపులో అమృతం ఉన్న కుండను దాచుకోవటం సాధ్యమయ్యేపనేనా? ఒకవేళ రావణుడి కడుపులో అమృతభాండం ఉందని కాసేపు అనుకుందాం.

దేవతలకు అమృతం దొరికిన తరువాత వాళ్లు దాన్ని తాగి.. తమ రక్తంలో కలిపేసుకుని చిరంజీవులయ్యారు. అంతే కానీ, గిన్నెల్లోనో.. కుండల్లోనో నింపుకుని కడుపుల్లో దాచుకోలేదు. అమృతం తాగితే చిరంజీవులు అవుతారు కానీ, సీల్ చేసి కడుపులో పెట్టుకుంటే ఎలా చిరంజీవి అవుతారు? అలాంటప్పుడు రాముడు కడుపులోకి బాణం కొట్టి అమృతభాండాన్ని బద్దలు చేయటం ఏమిటి? దీని వెనుక ఉన్న లాజిక్ ఏమిటి? రామాయణంలో ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ఆయన విష్ణువుగా.. అవతార పురుషుడిగా మనకు కనిపించడు. ఒక మనిషి తానుగా ఎలా ఎదగాలి.. శక్తి సామర్థ్యాలు ఎలా సంపాదించుకోవాలి? విజేతగా ఎలా నిలవాలి? అన్నవాటిని అక్షరాలా తాను చేసి చూపించినవాడు శ్రీరామచంద్రుడు, నేను మనిషిని.. మనిషి ధర్మమే నాది.. ఈ భూమ్మీద ఎలాంటి అధర్మపు నీడను కూడా నేను సహించను అని అరణ్యకాండలో రాముడు విస్పష్టంగా చెప్పాడు. కాబట్టి శ్రీరామ చంద్రుడు అవతారపురుషుడే అయినా ఖచ్చితంగా సాధారణ మనిషి లాగానే తానూ ప్రవర్తించాడు. ఆయన ఒక రాజుగా తాను చేయవలసిందంతా చేశాడు. ధర్మాన్ని అతిక్రమించిన వాళ్లు ఎంతటి వారైనా శిక్షించాడు. యుద్ధ రంగంలో అలా వెళ్లి ఏవో దివ్యశక్తులతో రావణుణ్ణి దండించలేదు. చిన్నప్పటి నుంచీ రాముడు ఒక లక్ష్యంతో పెరిగాడు. అన్ని విద్యలూ నేర్చుకున్నాడు. ఏ ఆయుధాన్ని, ఏ అస్త్రాన్ని ఎలా ప్రయోగించాలో పూర్తి నైపుణ్యంతో నేర్చుకున్నాడు. చిన్నతనంలో గురువు దగ్గర విద్యాభ్యాసానికి వెళ్లటానికి ముందే ధనుర్విద్య ప్రారంభించాడు. భారత కాలం నాటికి చాలా ఆయుధాలు రంగంలోకి వచ్చాయి కానీ, త్రేతాయుగంలో మాత్రం విల్లే ప్రధాన ఆయుధం.. ఇందజిత్తు, రావణుడు, రాముడు, లక్ష్మణుడు అంతా విల్లుతో యుద్ధం చేసిన వాళ్లే.

రాముడికి ధనుర్విద్యలో ఓనమాలు నేర్పింది ఎవరో తెలుసా? ఎవరైతే ఆయన్ను అడవులకు పంపాలని భర్తను డిమాండ్ చేసిందో ఆమె.. కైకేయి. మొదట్నుంచీ ఆమె టార్గెట్ రాముణ్ణి రావణాంతకుడిగా తయారుచేసి పంపిచాలన్నదే.. అందుకోసమే మొదట్నుంచీ రాముణ్ణి పెంచి పెద్ద చేసింది కైకేయే. ధనుర్విద్యను రాముడు మొదట ఆమె దగ్గరే నేర్చుకున్నాడు. ఆ తరువాత విశ్వామిత్రుడితో యాగరక్షణ పేరుతో అడవికి వెళ్లి ఆయన దగ్గర అనేక అస్త్రాలను ప్రయోగించటం, ఉపసంహరించటం నేర్చుకున్నాడు. ఆనాటి కాలంలో అతి ముఖ్యమైన బల అతిబల విద్యలను కూడ విశ్వామిత్రుడి దగ్గరే రాముడు నేర్చుకున్నాడు. రాముడు అడవికి వెళ్లే నాటికే పూర్తిస్థాయిలో యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడు. అడవుల్లో పధ్నాలుగేళ్లు వనవాస జీవితం గడిపినా.. సాధువులా ఉండలేదు. దండకారణ్యానికి రావణుడి ప్రతినిధిగా, మన పరిభాషలో గవర్నర్లుగా వ్యవహరిస్తున్న ఖరదూషణులను.. వారి దగ్గరున్న 14వేల మంది సైన్యాన్ని అంతం చేశాడు. శూర్పణకను ఆయన తమ్ముడు పరాభవించి పంపాడు. ఒక్కమాటలో చెప్పాలంటే మొదట్నుంచీ మనం ఏ విద్యనైనా ఎలా నేర్చుకుంటామో.. రాముడూ అలాగే నేర్చుకున్నాడు. మహారాక్షస సంహారానికి వ్యూహాత్మకమైన రణతంత్ర ప్రయోగాన్ని చేశాడు. తాను అడవికి వెళ్లింది రావణ సంహారానికని రాముడికి స్పష్టంగా తెలుసు.. మొదట మారీచ సుబాహుల ద్వారా తాను వచ్చానన్న సంకేతాన్ని రావణుడికి పంపించాడు. ఆ తరువాత ఖరదూషణులను చంపటంతో అతణ్ణి కవ్వించినట్లయింది. శూర్పణక పరాభవంతో రావణుడు పూర్తిగా రాముడి ఎత్తుగడకు పడిపోయాడు.. పరుగులు పెడుతూ దండకారణ్యానికి వచ్చి చేయరాని తప్పిదాన్ని, సీతాపహరణం రూపంలో చేసేశాడు. రాముడు లంకలో ప్రవేశించటానికి ముందే చాలా పక్కాగా ప్లాన్ చేసుకున్నాడు. సీతాదేవిని



ఏ వైపు రావణుడు తీసుకెళ్లాడో జటాయువు ముందే చెప్పాడు. అందుకే హనుమంతుడిని అటువైపు పంపించాడు. అతను లంకకు వెళ్లి సీతమ్మ జాడను తెలుసుకోవడం కంటే చాలా పెద్దపనే చేశాడు. దీంతో రాముడి గెలుపు చాలా సులువైంది. ఆంజనేయుణ్ణి లంకకు పంపించటం వెనుక రాముడి రణతంత్రాన్ని రావణుడు ఊహించలేకపోయాడు. హనుమంతుడు.. సీత జాడతో పాటు రావణుడి వ్యూహాత్మక యుద్ధ స్థావరాలను ధ్వంసం చేశాడు. అతడి కుమారుల్లో ఒకడైన అక్షయుణ్ణి హతమార్చాడు. వైమానిక దాడుల కోసం రావణుడు ఉపయోగించే విమానాశ్రయాలను ధ్వంసం చేశాడు. ఆయుధాగారాలను దగ్ధం చేశాడు. వానరులు.. గోలాంగూలాలు.. భల్లూకులు రాముడి సేనావాహినిలో మూడు ప్రధాన విభాగాలుగా ఉన్నాయి. లంకకు చేరుకున్న తరువాత మూడు వైపుల మూడు దళాలను మోహరించాడు. అదే సమయంలో అన్నతో గొడవపడి వచ్చిన విభీషణుణ్ణి తన శిబిరంలోకి చేర్చుకోవటం యుద్ధనీతిలో భాగమే. శత్రువు బలాలు.. బలహీనతల గురించి తెలుసుకుని దానికి తగ్గట్టుగా యుద్ధవ్యూహం పన్నటానికి ఇతను ఆసాంతం రాముడికి ఉపయోగపడ్డాడు. అదే సమయంలో రావణుడు కూడా తన నిఘా వర్గాలను అలర్ట్ చేశాడు. ఇద్దరు సీక్రెట్ ఏజెంట్లు రాముడి వెంట ఉన్న సైన్యం వివరాలను, శక్తి సామర్థ్యాలను రావణుడికి వివరించారు. రావణుడు తన దగ్గరున్న దుర్భిణి(మైక్రోస్కోప్) ద్వారా రాముడి సైన్యాన్ని చూసి ఓ అంచనాకు వచ్చాడు. దాదాపు 18 మంది సేనా నాయకులు రావణుడి సైన్యాన్ని పటిష్ఠంగా నడిపిస్తున్నారు. ప్రహస్తుడు.. ఇంద్రజిత్తు, నికుంభుడు, విరూపాక్షుడు లాంటి వారుండగా.. తానూ, కుంభకర్ణుడూ యుద్ధానికి వెళ్లాల్సిన అవసరం రానే రాదనుకున్నాడు. రావణుడు. విరూపాక్షుణ్ణి నగరం మధ్యలో ఉంచి.. మిగతా వీరులను లంకానగరానికి నాలుగు ద్వారాల దగ్గరా మోహరించాడు. అదే విధంగా రాముడు కూడా తన వీరులను నాలుగు వైపులా పంపాడు. ఓ వైపు లంకపై వానరసేన ముప్పేటదాడికి పూనుకుంది. మరోవైపు ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. దాంతో ఇద్దరూ మూర్ఛపోయారు. గరుత్మంతుడు వచ్చి వాళ్లను విడిపించాల్సి వచ్చింది. ప్రహస్తుని నీలుడు హతమార్చాడు. ఇంద్రజిత్తును హతమార్చటానికి లక్ష్మణుడు చాలా కష్టపడాల్సి వచ్చింది. చివరకు ఒకరాత్రి మూర్ఛపోయిన లక్ష్మణుణ్ణి అంజనేయుడు తెచ్చిన సంజీవనీ మూలికలతో సుశేనుడు బతికించాడు.

చివరకు రావణుడు రంగంలోకి ప్రవేశించక తప్పలేదు. రావణుడి భీకర యుద్ధానికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. అతని పిడికిలి దెబ్బకు హనుమంతుడు కంపించిపోయాడు. రావణుడు విసిరిన శక్తికి లక్ష్మణుడు సొమ్మసిల్లి పడిపోయాడు.. ఆ తరువాత హనుమంతుడు రాముడిని తన భుజాలపై ఎక్కించుకుని అసురుడిపైకి ఉరుకురికి వెళ్లాడు. రాముడి బాణాలకు రావణుడి రథం, గుర్రాలు.. ధ్వంసం అయ్యాయి. మర్నాడు కుంభకర్ణుడు సీన్లోకి వచ్చాడు. ఇతని దెబ్బకు హనుమంతుడు రక్తం కక్కుకున్నాడు. మిగతా వానరవీరులు వాడి విదిలింపులకే మూర్ఛపోయారు. ఆ తరువాత రాముడు రెండు గొప్ప అస్త్రాలను ప్రయోగించి అతణ్ణి హతమార్చాడు. మూడో రోజున తిరిగి రావణుడితో భీకరమైన యుద్ధం జరిగింది. రామరావణుల జీరాలు రక్తసిక్తమయ్యాయి. రావణుడితో సమానంగా పోరాడటం కోసం ఇంద్రుడు తన రథాన్ని పంపించాడు. రావణుడి తలల్ని నూటొక్క సార్లు తెగనరికినా అవి తిరిగి మొలుస్తూనే ఉన్నాయి. చివరకు బ్రహ్మసాన్ని ప్రయోగించాడు. ఆ బ్రహ్మాస్త్రం రావణుడి గుండెను చీల్చేసింది. అలా రాముడు రావణుణ్ణి హతమార్చాడు. రావణ వధ అంతా చెప్పుకుం టున్నట్టు విజయదశమి నాడు జరగలేదు. యుద్ధకాండ (92/64)లో చెప్పినట్టు అమావాస్య రోజున చోటు చేసుకుంది. రావణుడిని వధించిన సమయంలో రాముడు జయ నినాదం చేశాడు. ఓ చేత్తో ధనస్సును.. మరో చేత్తో బాణాణ్ణి పట్టి తిప్పుతూ రక్తంతో ఎరుపెక్కిన శరీరంతో నిలుచున్నాడు. రాముడు దేవుడిలా కంటే మామూలు మనిషిలాగానే వీరోచితంగా పోరాడాడు.. యుద్ధంలో ఆయన శరీరం కూడా గాయపడింది.. నువ్వానేనా అన్న స్థాయిలో యుద్ధం చేశాకే రాముడు గెలిచాడు. అంతే కానీ.. ఏదో దివ్యశక్తులతో ఓ సుదర్శన చక్రాన్ని సింపుల్ గా ప్రయోగించి రావణుణ్ణి చంపలేదు. తాను ఒక మనిషిగా.. మనిషి జీవితంలో విశ్వవిజేతగా నిలవాలంటే ఏ విధంగా ఉండాలో.. ఏం చేయాలో రాముడు అది చేసి చూపించాడు. మనిషిలో ఉండాల్సిన అన్ని కోణాలను రాముడు చూపించగలిగాడు కాబట్టే ఆయన లోకనాయకుడయ్యాడు.



**కోవెల సంతోష్ కుమార్,**
రచయిత
ఫోన్ నంబర్: 90521 16463

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.